


# విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY



ఆవుల పుల్లారెడ్డి సేవా సమితి

రి.నెం. 119/2015

ఆళ్ళగడ్డ, కర్నూలు జిల్లా

ఉచిత కళ్యాణ మండపం
స్వయం ఉపాధి శిక్షణ
ఉచిత రక్తదానము
ఉచిత న్యాయ సలహాలు
ఉచిత కంప్యూటర్ శిక్షణ

సంప్రదించవలసిన చిరునామా

అధ్యక్షులు ఆవుల విజయభాస్కర రెడ్డి అడ్వకేట్ B.A.L.L.B

ఆళ్లగడ్డ

9440232308,9494498787



PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి ఆదివారం 12 సెప్టెంబరు 2021 సంపుటి : 03 సంచిక : 36 పేజీలు : 4 వెల : రూ 3-00



## భారత్ నేర్పిన మానవతా విలువలే శాశ్వత పరిష్కారమన్న మోదీ



న్యూఢిల్లీ: అమెరికాపై 2001 సెప్టెంబర్ 21న అల్‌ఖైదా ఉగ్రవాదాలు జరిపిన దాడి అత్యంత విషాదకరమని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండాలంటే భారత్ నేర్పిన

మానవతా విలువలే శాశ్వత పరిష్కారమని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. శనివారంనాడు గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో సర్దార్‌ధామ్ భవన్ ప్రారంభోత్సవం సందర్భంగా మోదీ ఈ ప్రకటన చేశారు. సెప్టెంబర్ 11వ తేదీకి మరో ప్రాధాన్యత కూడా ఉందని, చికాలోలో స్వామి వివేకానంద 1893లో ఇదే తేదీన ప్రసంగం చేశారని, భారతదేశ మానవతా విలువలను ప్రపంచ దేశాలకు స్వామి వివేకానందం తన ప్రసంగంలో చాటి చెప్పారని అన్నారు. భారతదేశ సంస్కృతిని ఎంతో అద్భుతంగా విశ్వవేదికపై స్వామి వివేకానంద ఆవిష్కరించారని చెప్పారు. మానవత్వంపై దాడి జరిగిన రోజు, ప్రపంచానికి మానవతా విలువలు చాటిన రోజు అయిన సెప్టెంబర్ 11నే సర్దార్‌ధామ్ భవన్ ప్రారంభం కావడం విశేషమని పేర్కొన్నారు. విద్య, సామాజిక మార్పు, బలహీన వర్గాలకు చేయూత, యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా సర్దార్‌ధామ్ పని చేస్తుందని చెప్పారు. ఆర్థిక అసమానతలకు తావులేకుండా 2,000 మంది బాలికలకు కన్యా ఛాత్రాలయలో హాస్టల్ సౌకర్యం కల్పిస్తుందని ప్రధాని చెప్పారు. కోవిడ్ మహమ్మారిపై మాట్లాడుతూ, భారతదేశంతో సహా ప్రపంచ ఆర్థిక వ్యవస్థలపై కరోనా ప్రభావం పడిందని, అయితే భారత ఆర్థిక వ్యవస్థ కుదేలైనప్పటికీ అంతకంటే వేగంగా కోలుకుందని ప్రధాని అన్నారు.

## అక్బర్ కుటుంబానికి.. అండగా ఉంటాం..: చంద్రబాబు



అమరావతి: ఏపీలో వైసీపీ ప్రభుత్వం వచ్చాక.. రాష్ట్రంలో రోజుకో దుర్మార్గపు వార్త వినాల్సి వస్తోందని మాజీ సీఎం చంద్రబాబునాయుడు పేర్కొన్నారు. వైసీపీ నేతల దౌర్జన్యాలపై శనివారం ఆయన ట్విట్టర్ వేదికగా స్పందించారు. కడప జిల్లా మైదుకూరులో సీఎం జగన్ రెడ్డి బంధువు తిరుపాల్ రెడ్డి.. ముస్లిం మైనారిటీ అయిన అక్బర్ బాషా భూమిని కబ్జా చేసినట్టు తెలిసిందన్నారు. ఇటీవల కొందరు పోలీసులు తమ విధుల్ని పక్కనపెట్టి సివిల్ పంచాయితీల్లో తలదూర్చడం సాధారణమైందని చెప్పారు. తిరుపాల్ రెడ్డి వర్గానికి చెందిన సీఐ.. అక్బర్‌ను స్టేషన్లో కూర్చోబెట్టి, అతని పొలంలో దౌర్జన్యంగా నాట్లు వేయించారని ఆరోపించారు. అంతటితో ఆగకుండా ఎన్‌కౌంటర్ చేస్తానని బాధితుడిని బెదిరించడం దుర్మార్గమన్నారు. న్యాయం చేయాల్సిన పోలీసులే బాధితుడిపై దౌర్జన్యానికి దిగితే.. సామాన్యుడికి ఇక దిక్కెవరని ప్రశ్నించారు. గతంలో నంద్యాలలో సలీం కుటుంబం కూడా ఆత్మహత్య చేసుకుందని గుర్తు చేశారు. ఇప్పుడు అక్బర్ కుటుంబం కూడా.. తాము ఆత్మహత్య చేసుకుంటామని చెబుతున్నారని తెలిపారు. అక్బర్ కుటుంబానికి టీడీపీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ప్రభుత్వం వెంటనే అక్బర్ కుటుంబానికి న్యాయం చేసి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని చంద్రబాబు డిమాండ్ చేశారు.

## మైనార్టీ కుటుంబం సెల్ఫీ వీడియోపై సీఎం జగన్ స్పందన



అమరావతి: కడప జిల్లా దువ్వూరుకు చెందిన ఓ మైనార్టీ కుటుంబం సోషల్ మీడియాలో పెట్టిన సెల్ఫీ వీడియోపై సీఎం జగన్ స్పందించారు. కడప జిల్లా ఎస్పీ అన్బురాజన్‌తో మాట్లాడారు. ఎస్పీకి ఫోన్ చేసి వివరాలు తెలుసుకున్నారు. వారంలో సమస్య పరిష్కరించాలని ఎస్పీ, కలెక్టర్‌కు సీఎం ఆదేశించారు. మైదుకూరు గ్రామీణ సీఐ వ్యవహారంపై విచారణ జరిపి వారంలోగా చర్యలు తీసుకోవాలన్నారు. భూమికి సంబంధించి వారంలో కలెక్టర్ విచారించి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. అంతకముందు సెల్ఫీ వీడియో చూసి అక్బర్ బాషా కుటుంబాన్ని ఎస్పీ తన వద్దకు పిలిపించుకున్నారు. బాధిత కుటుంబం, కడప వైకాపా నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. అక్బర్‌బాషా సెల్ఫీ వీడియోపై రాత్రి 11.20 గంటలకు స్పందించామన్నారు. వెంటనే బాధితుడి ఇంటికి వెళ్లి వివరాలు తెలుసుకున్నట్లు వివరించారు. ఈ నెల 9న ఎస్పీ స్పందన కార్యాలయంలో అక్బర్ పిటిషన్ ఇచ్చారని తెలిపారు. "సీఐ వ్యవహారంపై విచారణకు అదనపు ఎస్పీ దేవప్రసాద్‌ను నియమించాం. సీఐ కొండారెడ్డిని 2 రోజుల పాటు విధుల నుంచి తప్పించాం. భూ సమస్య పరిష్కరించాలని సీఎంవో కూడా ఆదేశాలిచ్చింది" అని ఎస్పీ అన్బురాజన్ తెలిపారు.

వారంలో సమస్య పరిష్కరిస్తామన్నారు: అక్బర్

వారం రోజుల్లో తమ సమస్య పరిష్కరిస్తామని ఎస్పీ అన్బురాజన్ హామీ ఇచ్చారని అక్బర్ బాషా తెలిపారు. కడపలో ఎస్పీని కలిసిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. సీఐ కొండారెడ్డి తీరుతో తమకు తీవ్ర ఆవేదన మిగిలిందన్నారు. సీఎం కార్యాలయం నుంచి ఫోన్ వచ్చినట్లు ఎస్పీ తెలిపారని అక్బర్ చెప్పారు.

## రమ్య కుటుంబానికి ఐదు సెంట్ల ఇంటిపట్టా అందజేత

రమ్య కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంది

రమ్య హత్య కేసు విచారణకు ఫాస్ట్ ట్రాక్ కోర్టు ఏర్పాటు

హోంమంత్రి మేకతోటి సుచరిత



గుంటూరు: రమ్య కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉందని హోంమంత్రి మేకతోటి సుచరిత అన్నారు. బీటెక్ విద్యార్థిని రమ్య కుటుంబానికి ఐదు సెంట్ల నివాస స్థలానికి సంబంధించిన పట్టాను శనివారం సుచరిత అందజేశారు. హోంమంత్రి వెంట ఎమ్మెల్యేలు మేరుగు నాగార్జున, ముస్తఫా, మద్దాలి గిరిధర్, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, జిల్లా కలెక్టర్ వివేక్ యాదవ్ ఉన్నారు. ఈ సందర్భంగా మంత్రి సుచరిత మాట్లాడుతూ, రమ్య కుటుంబ సభ్యులు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిశారని, రమ్య సోదరి మౌనికకు డిగ్రీ పూర్తయ్యేంత వరకు ఆగకుండా వెంటనే ఉద్యోగం కల్పించాలని సీఎం ఆదేశించారన్నారు. రమ్య హత్య కేసు విచారణకు ఫాస్ట్ ట్రాక్ కోర్టు ఏర్పాటు చేస్తామని మంత్రి తెలిపారు. అందరూ దిశ యాప్‌ను ఉపయోగించుకోవాలని సూచించారు. పాలడుగు ఘటనలో పోలీసు విచారణ జరుగుతుందని నిందితులను పట్టుకోగానే మీడియా ముందు పోలీసులు ప్రవేశపెడతారన్నారు. విచారణ దశలో పూర్తి వివరాలను వెల్లడిస్తే నిందితులు తప్పించుకునే అవకాశం ఉందని, ఘటనపై పూర్తిస్థాయి దర్యాప్తు జరుగుతోందని మంత్రి సుచరిత వెల్లడించారు.

## పింఛన్లు ఎలా ఎగ్గొట్టాలన్న ఆలోచన మానుకోవాలి: రఘురామ

దిల్లీ: ఏపీలో నవరత్నాలు రాలిపోయే రత్నాల పరిస్థితికి వచ్చాయని వైకాపా ఎంపీ రఘురామకృష్ణరాజు విమర్శించారు. విద్యుత్ బిల్లులు రూ.300 దాటితే డయాలసిస్ రోగులకు పింఛన్లలో కోత విధించడం ఎంతవరకు సబబు అని ప్రశ్నించారు. గ్రామ వాలంటీర్ల



తల్లిదండ్రులకు సైతం పింఛను రద్దు చేయడం సరికాదని అభిప్రాయపడ్డారు. దిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. నవరత్నాలు నెమ్మదిగా రాలిపోవడానికి సిద్ధంగా ఉన్న రత్నాలుగా మారాయన్నారు. కరెంటు యూనిట్లకు కిడ్నీ రోగులకు ఇచ్చే పింఛనుకు సంబంధం ఏమిటని ప్రశ్నించారు. కిడ్నీ రోగులను నాలుగు కాలాల పాటు బతకనివ్వండంటూ రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గ్రామాల్లో పనిచేసే వాలంటీర్లు ఉద్యోగులు కాదు.. సేవకులని మనమే అంటున్నామని.. అలాంటి సేవకుల కుటుంబాలను 'షేవ్' (రాఊంఎఇ) చేయడం ఎంతవరకు సమంజసమని ప్రజలు అడుగుతున్నారన్నారు. పింఛన్లకు ఏదో ఒక విధానం పెట్టాలి తప్ప ఎలా ఎగ్గొట్టాలన్న ఆలోచనను మానుకోవాలని హితవుపలికారు.

## హిందూ ధర్మ ప్రచారాన్ని విస్తృతం చేయండి: స్వరూపానందేంద్ర సరస్వతి



విశాఖపట్నం: టీటీడీ ఆధ్వర్యంలో హిందూ ధర్మ ప్రచారాన్ని విస్తృతం చేయాలని విశాఖ శ్రీ శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి సూచించారు. టీటీడీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ జవహర్ రెడ్డి.. శనివారం రిషికేష్ వెళ్ళి పీఠాధిపతులు స్వరూపానందేంద్ర సరస్వతి, స్వాత్మానందేంద్ర సరస్వతి స్వాములను కలిశారు. ఈ సందర్భంగా టీటీడీ చేపట్టాల్సిన అనేక అభివృద్ధి కార్యక్రమాలపై ఈఓ జవహర్ రెడ్డికి.. స్వాములు పలు సూచనలు చేశారు. స్వరూపానందేంద్ర సరస్వతి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని ఆలయాలను కేంద్రంగా చేసుకుని టీటీడీ తరపున హిందూ ధర్మ ప్రచారాన్ని విస్తృతం చేయాలని చెప్పారు. గిరిజన, హరిజన ప్రాంతాల్లో భజన మండళ్లకు పూర్వవైభవం తీసుకురావాలని సూచించారు. సాంప్రదాయ భోజన విక్రయాలను నిలిపేస్తూ నిర్ణయాన్ని ప్రకటించడంపై స్వరూపానందేంద్ర సరస్వతి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా టీటీడీ చేపడుతున్న సేవా కార్యక్రమాలను ఈవో జవహర్ రెడ్డి.. పీఠాధిపతుల దృష్టికి తీసుకొచ్చారు. చిల్డ్రన్ స్పెషాలిటీ హాస్పిటల్‌ను త్వరలో అందుబాటులోకి తీసుకొస్తున్నామని, ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయని వివరించారు. టీటీడీ ద్వారా గోరక్షణ కోసం విస్తృత చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమాలపై ఈవో జవహర్ రెడ్డిని స్వరూపానందేంద్ర స్వామి అభినందించారు.

## పోలీస్ వ్యవస్థను ఫ్యాక్షన్ సైన్యంగా జగన్ మార్చుకున్నాడు: చినరాజప్ప



అమరావతి: అధికారం ఆయుధంగా, చట్టాన్ని చుట్టంగా జగన్ బంధువులు, పార్టీ నేతలు మార్చుకున్నారని టీడీపీ నేత చినరాజప్ప అన్నారు. తమ పార్టీకి చెందిన మైనారిటీ నేత అక్బర్ బాషా భూమిని సీఎం బంధువు తిరుపాల్ రెడ్డి కబ్జా చేశారని ఆరోపించారు. సీఐ కొండారెడ్డితో తిరుపాల్ రెడ్డి బాషాను బెదిరించారని చెప్పారు. న్యాయం చేయాల్సిన పోలీసులు బాధితుడిపై దౌర్జన్యానికి దిగుతున్నారని ఆరోపించారు. పోలీస్ వ్యవస్థని జగన్ ఫ్యాక్షన్ సైన్యంగా మార్చుకున్నాడని విమర్శించారు.

## యూపీలో లా యూనివర్సిటీ, హైకోర్టు కాంప్లెక్స్‌కు రాష్ట్రపతి శంకుస్థాపన

లక్నో: ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగరాజ్‌లో నిర్మించనున్న జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం, అలహాబాద్ హైకోర్టు కొత్త బిల్డింగ్ కాంప్లెక్స్‌కు రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ శనివారం శంకుస్థాపన చేశారు. కేంద్ర న్యాయ శాఖ మంత్రి కిరణ్ రిజిజు, భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) ఎన్వీ రమణ, సుప్రీంకోర్టు సీనియర్ న్యాయమూర్తులు, గవర్నర్ ఆనందిబెన్ పటేల్, సీఎం యోగి ఆదిత్యనాథ్, ఉప ముఖ్యమంత్రి కేశవ్ ప్రసాద్ మౌర్య, ఎంపీ రీటా బహుగుణ జోషి, రాష్ట్ర న్యాయ మంత్రి, బీజేపీ ఎమ్మెల్యేలు, నేతలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రజలకు సకాలంలో, చౌకగా న్యాయం అంది ంచడం మన బాధ్యత అని రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఈ సందర్భంగా అన్నారు. మౌలిక సదుపాయాల కొరత వల్ల న్యాయవాదులు, క్లయింట్లు అనేక సమస్యలను ఎదుర్కొంటు న్నారని తెలిపారు. న్యాయం కోసం పేదలు ఎన్నో ఇబ్బందులు పడిన వైనాన్ని తాను చూశానన్నారు. సరైన మౌలిక సదుపాయాలు, న్యాయ నియామకాలు సకాలంలో న్యాయం అందేందుకు దోహదం చేస్తాయని చెప్పారు. ప్రపంచంలోని అత్యుత్తమ న్యాయ విశ్వవిద్యాల యాలను అధ్యయనం చేసిన తర్వాత రూపొందించిన మార్గదర్శకాలకు అనుగుణంగా జాతీయ న్యాయ విశ్వవిద్యాలయాన్ని నిర్మించాలని రాష్ట్రపతి ఆకాంక్షించారు.



## జగన్ సర్కార్‌పై వంగలపూడి అనిత ప్రశ్నాస్త్రాలు..



అమరావతి : ఏపీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై టీడీపీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు వంగలపూడి అనిత ప్రశ్నల వర్షం కురిపించారు. ఏపీలో మహిళలపై పెరుగుతున్న అఘాయిత్యాలను అరికట్టేందుకు ప్రభుత్వం తీసుకున్న చర్యలు ఏంటో చెప్పాలని ఆమె లేఖలో కోరారు. అఘాయిత్యాలకు పాల్పడిన నేరస్థులకు దిశ చట్టం అమలు చేస్తున్నారా..? అని ప్రశ్నించారు. దిశ ద్వారా ఎంత మందికి శిక్షలు వేశారని లేఖలో పేర్కొన్నారు. 'మహిళలతో నీచంగా మాట్లాడుతూ అడ్డంగా దొరికిన మీ మంత్రులు, ఎమ్మెల్యేలపై మీరేం చర్యలు తీసుకున్నారు..? గడిచిన 26 నెలల్లో 500 మందికి పైగా అఘాయిత్యాలు జరిగితే 21 రోజుల్లో ఎంత మందికి ఉరివేశారో చెప్పాలి. రమ్య హత్యకు కారణమైన వ్యక్తిని ఎందుకు ఉరితీయలేదు..?. టీడీపీ ప్రభుత్వం అమలు చేసిన ఫోర్త్ లయన్ యాప్?ను.. కాపీ కొట్టి దిశా యాప్ ప్రభుత్వమే రూపొందించినట్టు ప్రచారం చేసుకోవడం దివాళాకోరుతనం కాదా..?' అని జగన్ సర్కార్‌పై అనిత ప్రశ్నాస్త్రాలు సంధించారు.

## డ్రోన్ల ద్వారా ఔషధాల సరఫరా ఒక గొప్ప మార్పు: సింధియా

హైదరాబాద్: డ్రోన్ల ద్వారా ఔషధాల సరఫరా ఒక గొప్ప మార్పు అని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా అన్నారు. నాంపల్లిలోని భాజపా కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సింధియా మాట్లాడారు. "విమానాయాన రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చాం. డిజిటల్ ఎయిర్ స్పేస్ మ్యాప్ ద్వారా అనుమతులు సులభతరం చేశాం. డ్రోన్లకు అనుమతులు, నిర్వహణను సులభతరం చేశాం. విమానాశ్రయం విస్తరించాలని రాష్ట్ర ప్రభుత్వం కోరుతోంది. వరంగల్, ఆదిలాబాద్‌లో బ్రౌన్ ఫీల్డ్ విమానాశ్రయాలకు సుముఖంగా ఉన్నాం" అని సింధియా వివరించారు. అంతకు ముందు జ్యోతిరాదిత్య సింధియా తెలంగాణ సీఎం కేసీఆర్‌తో సమావేశమయ్యారు. ప్రగతిభవన్‌కు వెళ్లిన ఆయన ముఖ్యమంత్రితో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించినట్టు సమాచారం.

# సంపాదకీయం

ఆదివారం 12 సెప్టెంబరు 2021

## కులగణన.. కమలానికి కష్టమేనా

బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్, ఆర్జేడీ నేత తేజస్వి యాదవ్, హెచ్ఏఎమ్ అధ్యక్షుడు జితిన్ రామ్ మాంఝీ తదితర నేతలు కులాలవారీగా జనాభా గణన సమస్యపై ఆగస్టు 23న ప్రధాని నరేంద్రమోదీతో భేటీ అయ్యారు. ప్రధానితో భేటీ తర్వాత బిహార్ సీఎం నితీశ్ కుమార్ మీడియాతో మాట్లాడుతూ కులాలవారీ జనగణన అంశంపై నిర్ణయం ప్రధాని మోదీపైనే ఉందనేశారు. ఈ అంశంపై బిహార్ ప్రజలతోపాటు దేశం మొత్తంగా ఒకే అభిప్రాయాన్ని కలిగి ఉన్నారని, ప్రధాని మా మాటలు ఆలకించినందుకు కృతజ్ఞులమనీ, ఆయనే ఇక దీనిపై నిర్ణయం తీసుకోవలసి ఉందని నితీశ్ స్పష్టం చేశారు. దేశంలో కులాలవారీ జనాభా గణన చేపట్టాలని ప్రధానిపై ఒత్తిడి తీసుకురావడమే నితీశ్ లక్ష్యం. ప్రధానితో భేటీ అనంతరం తేజస్వి యాదవ్ కూడా మాట్లాడుతూ, 'జాతి ప్రయోజనాల రీత్యా ఇది ఒక చారిత్రక ముందడుగు, పేదలంతా దీనివల్ల లబ్ధి పొందుతారు. దేశంలోని జంతువులను, చెట్ల సంఖ్యను లెక్కించగలుగుతున్నప్పుడు, కులాల వారీగా సమగ్ర డేటా లేకుండా ప్రభుత్వం సంక్షేమ విధానాలను ఎలా చేపట్టగలదని ప్రశ్నించారు. ఇది కొన్ని ప్రశ్నలను లేవనెత్తుతోంది. కులాలవారీ జనగణనపై నిర్ణయం తీసుకోవడం ప్రధానికి సులభమైన పనేనా? కేంద్రంలో బీజేపీ నేతృత్వంలోని ప్రభుత్వానికి దీనివల్ల ఎదురయ్యే రాజకీయపరమైన ఇబ్బందులేమిటి? బిహార్లో ఆర్జేడీ, ఐక్య జనతాదళ్ వంటి ప్రాంతీయ పార్టీలకు, ఉత్తరప్రదేశ్‌లో సమాజ్‌వాదీ పార్టీకి, తదితర పార్టీలకు ఈ కులాలవారీ జనగణన తీసుకొచ్చే అవకాశాలేమిటి? ఈ సమస్యపై ఈ పార్టీలన్నీ ఎందుకు ఒక్కటయ్యాయి? 1991లో మండల్ కమిషన్ నివేదిక అమలు నాటి నుంచి సంఖ్యాపరంగా ఆధిక్యత కలిగి, రాజకీయంగా శక్తిమంతంగా ఉన్న ఇతర వెనుకబడిన కులాలు (ఓబీసీలు) ఆధారంగా ప్రత్యేకించి బిహార్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల్లోని ప్రాంతీయ పార్టీలు బలపడుతూ వచ్చాయి. 1998లో బీజేపీ కేంద్రంలో అధికారానికి వచ్చి అటల్ బిహారీ వాజ్‌పేయి ప్రధానిగా ఉన్నప్పటికీ, రెండు దశాబ్దాలపాటు బిహార్‌లో లాలూ ప్రసాద్ యాదవ్, ఉత్తరప్రదేశ్‌లో ములాయం సింగ్ యాదవ్ తమతమ రాష్ట్రాల్లో అధికార స్థానాల్లో కొనసాగుతూ వచ్చారు. 1990లలోనే యూపీలో, బిహార్‌లో బీజేపీ చొచ్చుకెళ్లి బలం పుంజుకున్నది వాస్తవం. అలాగే 21వ శతాబ్ది తొలి దశాబ్ది సమయంలో కాంగ్రెస్‌ను బీజేపీ మట్టికరిపించినప్పటికీ, క్షేత్రస్థాయిలో ములాయం సింగ్ యాదవ్, లాలూ ప్రసాద్ యాదవ్‌ల ఆధిక్యతను ఈ రెండు రాష్ట్రాల్లో కమలం సవాలు చేయలేకపోయింది. బీజేపీ ప్రధానంగా అగ్రకులాలు, వైశ్యుల పార్టీగా కొనసాగుతూ రావడమే దీనికి కారణం. ములాయం, లాలూ పార్టీల్లోని చీలికలు, ఘర్షణలను బీజేపీ ఉపయోగించుకున్నది వాస్తవం. ఈ రెండు పార్టీలు మండల్ కమిషన్ ద్వారా గణనీయంగా లబ్ధిపొందిన ఓబీసీల విశ్వాసాన్ని పొందాయి. అయితే ఈ రెండు రాష్ట్రాల్లోని కుల నాయకుల ఆకాంక్షలను సంతృప్తిపర్చడంలో బీజేపీ పూర్తిగా విఫలమైంది. ఉదాహరణకు, బిహార్ లోని పట్నా, నలంద ప్రాంతాల్లో కేంద్రీకృతమై ఉన్న కుర్మి కుల నాయకుడు నితీశ్ కుమార్‌ని బీజేపీ కొన్ని సార్లు పక్కనపెట్టింది. అలాగే తూర్పు ఉత్తరప్రదేశ్ లోని అప్నాదళ్ అధినేత అనుప్రియ పటేల్‌ని కూడా బీజేపీ దూరం పెట్టింది. కానీ, లాలూ, ములాయంల రాజకీయ బలానికి నష్టం కలిగించడంలో బీజేపీ విఫలమైందనే చెప్పాలి. పైగా బిహార్‌లో 17 శాతం, ఉత్తరప్రదేశ్‌లో 20 శాతం జనాభాగా ఉన్న ముస్లింల మద్దతును ఇప్పటికీ ఈ ఇద్దరు నేతలే పొందుతున్నారని మర్చిపోరాదు. 1998 నుంచి 2009 వరకు లోక్ సభ ఎన్నికల్లో ప్రాంతీయ పార్టీలు ప్రత్యేకించి లాలూ, ములాయం పార్టీలు ఓబీసీల నుంచి ఓట్లను వరుసగా 35 శాతం, 42 శాతం వరకు చేజిక్కించుకున్నాయి. 2004లో కాంగ్రెస్ నేతృత్వంలోని యునైటెడ్ ప్రోగ్రెసివ్ అలయెన్స్ బీజేపీ నేతృత్వంలోని నేషనల్ డెమొక్రాటిక్ అలయెన్స్ ప్రభుత్వాన్ని తోసిరాజని అధికారంలోకి వచ్చింది. 2009లో కూడా కేంద్రంలో అధికారాన్ని యూపీఏ నిలుపుకుంది. సెంటర్ ఫర్ స్టడీ ఆఫ్ డెవలపింగ్ సొసైటీస్ రాజకీయ వ్యాఖ్యాత ప్రొఫెసర్ సంజయ్ కుమార్ ఈ విషయంపై తాజాగా మరింత స్పష్టతనిచ్చారు. '2009 ఎన్నికల్లో ప్రాంతీయ పార్టీలు 42 శాతం ఓబీసీ ఓట్లను పొందగా బీజేపీ 22శాతం ఓట్లను పొందింది. కానీ తదుపరి దశాబ్దానికల్లా ఓబీసీల మద్దతును బీజేపీ గణనీయంగా పొంది ఆశ్చర్యపర్చింది. 2019 ఎన్నికల నాటికి బీజేపీ 42 శాతం ఓబీసీ ఓట్లను చేజిక్కించుకోగా, ప్రాంతీయ పార్టీలకు 27 శాతం ఓట్లు మాత్రమే దక్కాయి. ఈ మధ్యకాలంలో ఓబీసీలలో బీజేపీ మద్దతు బలం గణనీయంగా పెరిగిందనడానికి ఇదే స్పష్టమైన సాక్ష్యం." 2014 నుంచి 2019 మధ్య ఓబీసీల ఓట్లు స్థానం మారడానికి పలు కారణాలున్నాయి. ఓబీసీలలో, దళితులలో ఆర్ఎస్ఎస్ క్షేత్రస్థాయిలో చేసిన విస్తృతమైన కృషి వీటిలో ఒకటి. అలాగే బిహార్‌కి చెందిన కోయిరి నాయకుడు ఉపేంద్ర కుష్వా, అనుప్రియ పటేల్ వంటి ఓబీసీ నేతలు ములాయం, లాలూ పార్టీలకు దూరం కావడం కూడా దీనికి జతకలిసింది. బిహార్, ఉత్తరప్రదేశ్‌లలో యాదవులు, కుర్మీలు వంటి ఎగువతరగతి ఓబీసీలు శక్తిమంతంగా ఉంటున్నప్పటికీ, ఇటీవలికాలంలో ప్రధాని నరేంద్రమోదీ తన ఓబీసీ అస్తిత్వాన్ని వివిధ ప్రచార సభల్లో చాటుకుంటూ వచ్చారు. ఈ నేపథ్యంలో నోనియా, తెలి, మలకర్, తుర్హా, లోహర్, గోండ్ వంటి దిగువతరగతి ఓబీసీలను తనకు అనుకూలంగా తిప్పుకోవడంలో బీజేపీ విజయం సాధించిందని చాలామంది చెబుతున్నారు కానీ, ఇప్పటికీ బీజేపీకి అగ్రకులాల దన్నే అధికంగా ఉంటోందన్నది వాస్తవం. మొత్తానికి, లాలూ, ములాయం, తేజస్వి, అఖిలేష్ యాదవ్, నితీశ్ కుమార్‌తో సహా ఓబీసీ నేతలు, వారి వారసులు తమకు ఇన్నాళ్లుగా సాంప్రదాయికంగా కొనసాగుతూ వచ్చిన ఓటు పునాది తగ్గుతూ వస్తోందని స్పష్టంగానే గమనించారు. అదేసమయంలో కార్పొరేట్, అగ్రకులాల ప్రయోజనాలే పరమావధిగా కలిగిన బీజేపీ, పేదల అనుకూల ఎజెండాను రూపొందించడంలో పరిమితులను ఎదుర్కొంటూండటం కూడా వాస్తవమే. ఆర్ఎస్ఎస్ అధినేత మోహన్ భగవత్ రిజర్వేషన్ల విధానంపై పదే పదే వ్యతిరేకత వ్యక్తం చేయడం, మారుమూల ప్రాంతాల్లో అగ్రకులాలు పేదలపై చేస్తున్న అత్యాచారాలను బీజేపీ నిర్లక్ష్యం చేస్తూండటం కూడా తెలిసిందే.ఒక జాతీయ వారపత్రిక తాజా సర్వే ప్రకారం నరేంద్ర మోదీ ప్రజాదరణ 66 శాతం నుంచి 24 శాతానికి పడిపోయిందని దిగ్భ్రాంతికరమైన విషయాన్ని వెల్లడించింది. త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న ఉత్తరప్రదేశ్‌లో సీఎం ఆదిత్యనాథ్ యోగి ప్రజాదరణ కూడా నిరుపేద ఓటర్లలో తీవ్రంగా దెబ్బతింది. యూపీలో తిరిగి అధికారాన్ని నిలుపుకోవడానికి బీజేపీ సవాలు ఎదుర్కొంటున్న తరుణంలో నరేంద్రమోదీపై ఒత్తిడి తీసుకురావడానికి ఇదే సరైన సమయమని నితీశ్‌కు తెలుసు. అందుకే కులాలవారీ జనగణన డిమాండును మోదీ కనుక విస్మరిస్తే దిగువతరగతి ఓబీసీల్లో అది కచ్చితంగా సందేహాలను మరింతగా పెంచుతుందని జేడీయూ అత్యున్నత నాయకుడొకరు వివరించారు. ఇప్పటికే దిగువ తరగతి ఓబీసీలు నిత్యావసర వస్తువుల ధరల మోతబరువుతో, కోల్పోయిన జీవన అవకాశాలతో నలిగిపోతున్నారన్నది ఆయన భావం.

# మళ్లీ ఏపీ...కేరాఫ్ హైదరాబాద్....

విజయవాడ, సెప్టెంబర్ 11, (న్యూస్ పల్స్)విభజన ఏడేళ్ల క్రితం జరిగింది. ఇంకా విభజన గాయాలు అలాగే ఉన్నాయి. తీరని సమస్యలు ఎన్నో ఉన్నాయి. ఈ రోజుకూ నీటి తగాదాలూ కొనసాగుతూనే ఉన్నాయి. ఇదిలా ఉంటే ఆంధ్రప్రదేశ్ కి ఇప్పటికీ రాజధాని లేదు అన్న విమర్శలు వెక్కిరింపులు ఉన్నాయి. చంద్రబాబు హయాంలో అమరావతి రాజధాని మనదని చెప్పేవారు. అయితే అది ఎంతవరకూ పూర్తి అయిందో ఎవరికీ తెలియదు కానీ ఒక చిరునామా అంటూ నాడు ఉండేది. ఇపుడు జగన్ సర్కార్ మూడు రాజధానుల పుణ్యమాని ఏపీకి క్యాపిటల్ ఎక్కడ అని విద్యార్ధుల నుంచి మేధావుల వరకూ మిలియన్ డాలర్ ప్రశ్నగానే ఉంది.మరో వైపు చూస్తే కేంద్రం కూడా ఏపీ రాజధానిగా అమరావతిని గుర్తించడం లేదా అన్న చర్చ అయితే వస్తోంది. దానికి సంబంధించి చూస్తే కొన్ని ఉదాహరణలు కళ్ళకు కనిపిస్తున్నాయి. కేంద్రంతో వివిధ అంశాల మీద ప్రతీ రోజూ కరస్పాండెన్స్ చేస్తున్న ఏపీ అధికారులకు ఢిల్లీ నుంచి వస్తున్న జవాబుల్లో ఏపీ రాజధానిగా హైదరాబాద్ నే పేర్కొనడం విశేషం. అప్పటికీ ఏపీ అధికారులు అమరావతి పేరు మీదనే లేఖలు రాస్తున్నారుట. మరి ఈ చిత్రమేంటో వారికే అర్ధం కావడంలేదుట. ఈ మధ్యనే ఆర్టీఐ కింద ఒక సమాచారం కోసం ఏపీకి చెందిన ఒక వ్యక్తి కేంద్రంలోని కీలకమైన శాఖకు లేఖ రాస్తే ఆయనకు కూడా హైదరాబాద్ పేరు మీదనే జవాబు వచ్చిందట.ఇలా ఎందుకు జరుగుతోంది అన్నది అధికారుల స్థాయిలోనూ చర్చగానే ఉంది. అయితే టెక్నికల్ గా చూస్తే విభజన చట్టం ప్రకారం ఏపీ తెలంగాణాలకు కలిపి ఉమ్మడి రాజధానిగా హైదరాబాద్ ఉంటుంది. అది 2024 దాకా ఉంది. మధ్యలో ఏపీకి పాలకులు వచ్చినా అమరావతి రాజధాని అన్నా కూడా హైదరాబాద్ నే ఇంకా గుర్తించడానికి అదొక రీజన్ అంటున్నారు. మరో వైపు చూస్తే అమరావతిని భారత దేశం పొలిటికల్ మ్యాప్ లో పెట్టించామని గర్వంగా టీడీపీ ఎంపీ ఆ మధ్య చెప్పుకున్నారు. కానీ కేంద్రం మాత్రం అమరావతిని పట్టించుకోవడంలేదులాగానే ఉందిట.ఈ పరిణామాలు టీడీపీ నేతల్లో కలవరం రేపుతుండగా వైసీపీ మాత్రం హ్యాపీ ఫీల్ అవుతోందిట. మూడు రాజధానులకు కేంద్రం మద్దతుగా ఉందని, త్వరలో తమ కల సాకారం అవుతుంది అని వారు తెగ సంబర పడుతున్నారు. కర్నూలు కి హై కోర్టు ని తరలిస్తూ కేంద్రం కీలక నిర్ణయం తీసుకున్న మరు క్షణం జగన్ విశాఖకు పాలన మారుస్తారని కూడా నిబ్బరంగా చెబుతున్నారు. అయితే అధికారుల స్థాయిలో జరిగే కరస్పాండెన్స్ ని పట్టుకుని కేంద్రం మద్దతు అంటూ అపుడే ఒక నిర్ణయానికి రావడం కూడా మంచిది కాదు అన్న మాటా ఉంది. ఏదీ ఏమైనా ఏపీ వాసులలో మెజారిటీ ప్రజలు ఇప్పటికీ తమ జధాని హైదరాబాదే అని భావిస్తున్నారు. కేంద్రం వైఖరి కూడా అలాగే ఉంది. ఇంతకీ ఏపీకి సరైన రాజధాని లేదు కాబట్టే ఇలా జరుగుతోంది అంటున్నారు.

## గంటా వర్సెస్ అవంతి





విశాఖపట్టణం, సెప్టెంబర్ 11, (న్యూస్ పల్స్)గురువు చూపిన బాటే శిష్యుడికి శిరోధార్యం. ఎక్కడైనా జ్ఞానం అందించి వెలుగు దారి చూపే వాడే గురువు. ఆ మాటకు వస్తే విశాఖ జిల్లా మంత్రి అవంతి శ్రీనివాసరావుకు గురువు మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు. గంటా చలువతోనే అసెంబ్లీ ముఖం చూసిన అవంతి, ఆ తరువాత పార్లమెంట్ గేట్ దాటి కూడా ఎంపీ సీటులో కూర్చున్నారు. ఇక 2019 ఎన్నికల వేళ అదే గురువుతో పొసగక వైసీపీలో చేరి భీమిలీ నుంచి పోటీ చేసి అవంతి శ్రీనివాసరావు ఎమ్మెల్యే అయ్యారు. ఆ వెంటనే మంత్రి కుర్చీ కూడా పట్టేశారు. ఇప్పటిదాకా కథ బాగా నడిచింది ఆ తరువాతనే రివర్స్ అయింది మరి.మంత్రిగా గంటా శ్రీనివాసరావు బాగానే హవా చాటుకున్నారు. ఆయన చుట్టూ అధికార యంత్రాంగాన్ని తిప్పుకున్నారు. నాటి సీఎం చంద్రబాబు తలలో నాలుకలా ఉండేవారు. విశాఖ అర్బన్ జిల్లా వరకూ నాటి సీనియర్ మంత్రి అయ్యన్నపాత్రుడు కూడా వేలూ కాలూ పెట్టరాదని చంద్రబాబు ద్వారా శాసనం చేయించి మరీ దర్జా చలాయించారు. ఇక శిష్యుడు అవంతి మాత్రం దీనికి పూర్తిగా భిన్నం. ఆయన పేరుకు మంత్రి మాత్రమే అయ్యారు. కలెక్టర్ కాదు కదా ఆఖరుకు జీవీఎంసీ కమిషనర్ కూ డా మంత్రి మాట వినే పరిస్థితి లేదు. ఆ సంగతి ఈ మధ్యనే ఆయన సాటి కార్పోరేటర్లతో చెప్పుకుని తెగ బాధపడ్డారు. అంటే ఉత్సవ విగ్రహంగానే రెండున్నరేళ్ల కాలం నెట్టుకువచ్చారన్నమాట. ఇపుడు ఆ పదవి కూడా పోతోంది. తొందరలోనే గంటా శ్రీనివాసరావు పక్కన చేరి మాజీ మంత్రి అనిపించుకుంటారు అన్న మాట. 2018 వేళ భీమిలీ సీటు కోసం అంటు గంటా శ్రీనివాసరావు ఇటు అవంతి శ్రీనివాసరావు పోటీ పడ్డారు. టీడీపీలో చంద్రబాబు వీరిద్దరికీ సర్దిచెప్పలేక తల పట్టుకున్నారు. ఇక అక్కడ జరిగేది లేదు అని తెలుసుకుని అవంతి వైసీపీ నుంచి పోటీ చేశారు. కానీ ఈసారి అదే భీమిలీ నుంచి అవంతి కి టికెట్ గల్లంతు అన్న మాట వైసీపీలో వినిపిస్తోంది. ఆయన జగన్ ఊపులోనే 2019 ఎన్నికల్లో కేవలం తొమ్మిది వేల బొటాబొటీ మెజారిటీతో గెలిచారు. ఆ తరువాత జరిగిన లోకల్ బాడీ ఎన్నికల్లోనూ టీడీపీ అక్కడ బాగానే బలం పుంజుకుంది. దీన్ని బట్టి చూస్తే వచ్చే ఎన్నికల్లో అవంతికి మళ్లీ టికెట్ ఇచ్చినా భీమిలీలో ఓడిపోతారు అన్న అంచనాలు ఏవో అధినాయకత్వం వద్ద ఉన్నాయట. దాంతో భీమిలీకి అవంతిని దూరం పెడతారు అంటున్నారు. ఇక గంటా శ్రీనివాసరావు పరిస్థితి కూడా టీడీపీలో అలాగే ఉంది. ఆయనకు కూడా భీమిలీ టికెట్ ఇచ్చేది లేదు అని ఇప్పటికే టీడీపీ స్పష్టమైన సంకేతాలు ఇచ్చేసింది.ఇక గంటా శ్రీనివాసరావు టీడీపీ మాట విని దారికి వస్తే ఆయన్ని విశాఖ ఎంపీగా పోటీ చేయిస్తారు అంటున్నారు. అదే తీరున ఇపుడు అవంతి శ్రీనివాసరావు విషయంలోనూ వినిపిస్తున్న మాట. ఆయన్ని విశాఖ నుంచి కానీ అనకాపల్లి నుంచి ఎంపీగా బరిలోకి దింపు తారు అంటున్నారు. అంటే మళ్లీ ఎమ్మెల్యే గా పోటీ చేసి మంత్రి అయ్యే యోగం గురు శిష్యులు ఇద్దరికీ లేదని వారి పార్టీ పెద్దలు తేల్చేస్తున్నారు అన్న మాట. మొత్తానికి గురుశిష్యులజాతకాలు రెండూఒకేదారిలోసాగుతూండడం విశేషపరిణామమే.ఇద్దరూ ఇపుడు మెట్టు దిగే ఉన్నారు కాబట్టి బెట్టు సడలించుకుంటే మరో కొత్త ఏదైనా కనిపిస్తుందేమో వెతికితే బెటర్ అంటున్నారు అనుచరులు.

# 2024 కోసం బుర్రకు పదును

గుంటూరు, సెప్టెంబర్ 11, (న్యూస్ పల్స్)చంద్రబాబు మైకు పట్టుకుంటే గంటల తరబడి మాట్లాడుతారు. ఆయన పెద్ద వక్త కాదు కానీ చెప్పిందే చెబుతూ తన భావాలను జనం బుర్రలోకి తోసేయాలని తాపత్రయంతో అది అలా సుదీర్ఘ ప్రసంగం అవుతుంది. ఇక చంద్రబాబు మీడియా మీటింగులూ, పార్టీ మీటింగులు కూడా అలాగే ఉంటాయి. నిజం చెప్పాలంటే బాబు ఏంచేసినా చాలా లార్జి స్కేల్లోనే ఉంటుంది. ఇక చంద్రబాబు హామీలు కూడా కోటలు దాటుతాయి. ఆయన రెండు సార్లు ఓడిపోయి 2014 ఎన్నికలకు రెడీ అయినా వేళ ఇచ్చిన ఎన్నికల ప్రణాళిక చూస్తే అదొక బుక్ మాదిరిగా ఉంటుంది. దాని నిండా వందల కొద్దీ హామీలే. ఆరు వందలకు పైగా ఉన్నాయని వైసీపీ నేతలు చెబుతారు. అదంతా బాబు గెలవడం కోసం ఏపీలోని 13 జిల్లాల్లోని ప్రతీ సెక్షన్ని వదలకుండా ఇచ్చిన హామీల జల్లు అన్నమాట.ఇపుడు జగన్ ముఖ్యమంత్రిగా ఉన్నారు. ఆయన ఏ హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చారు అన్నది చంద్రబాబు ఇపుడు తెగ అధ్యయనం చేస్తున్నారు. తాను ఇవ్వలేనిది ఏంటి, జగన్ ఇచ్చినదేంటి ఇదే చంద్రబాబును తొలుస్తున్న ప్రశ్న. తాను ఎంతో చేశాను అనుకుంటే జనం జగన్ ని ఎందుకు ఇష్టపడ్డారూ ఇది కూడా బాబుకుని నిరంతరం కలవరపెడుతున్నదే. అయితే చంద్రబాబు దీనికి సమాధానాలు ఆలోచించలేని స్థితిలో ఏమీ లేరు. ఆయనకు తెలుసు తాను ఎక్కడ ఫెయిల్ అయ్యానో, అలాగే జగన్ సక్సెస్ ఎక్కడ ఉందో. దాంతో బాబు ఆలోచనలు అన్నీ కూడా 2024 నాటి హామీల మీదనే పరచుకుని ఉన్నాయని అంటున్నారు.ఇక 2024 నాటికి రాష్ట్ర జనాభా ఆరు కోట్లు అవుతుంది అనుకుంటే వారినెవరినీ వదలకుండా చంద్రబాబు అందరికీ హామీలు గుప్పించే అవకాశం ఉందని అంతా ఊహిస్తున్నదే. ఆ విధంగా తీసుకుంటే 2014 నాటి 600 హామీలు 2024 నాటికి ఆరువేల హామీలు అవుతాయి. అలాగే ఇక ఎన్నికల ప్రణాళిక పుస్తకం కూడా చాలా పెద్దదిగా ఉంటుందని కూడా అంటున్నారు. దీనిని చెప్పడానికి పెద్దగా ఆలోచించనవసరం లేదు. చంద్రబాబు రాజకీయాన్ని చూసిన వారికి అది సులువుగా అర్ధమయ్యేదే. బాబు హామీలు ఎన్ని అయినా ఇస్తారు, ఏమైనా చేస్తారు, ఆయనకు ఒక విధంగా 2024 చివరి ఎన్నికలు. తాడో పేడో అన్న మాట. ఇక జగన్ వరసగా రెండవ సారి కూడా అధికారంలోకి వస్తే చంద్రబాబు టీడీపీ చరిత్రలో కలసిపోవడం ఖాయమే.రాజకీయ విశ్లేషకులు కాస్తా తొందరపడి 2024 ఎన్నికల గురించి మాట్లాడుకోవడం సహజం.

కానీ వైసీపీ మంత్రి కొడాలి నాని కూడా అప్పటికి చంద్రబాబు ఏమేమి హామీలు ఇస్తారు, ఆయన తీరు ఎలా ఉంటుంది అన్నది తనదైన విశ్లేషణ చేస్తున్నారు. సెటైర్లూ వేస్తున్నారు. చంద్రబాబు ఎన్నికల మ్యానిఫెస్టో 2024 ఎన్నికల నాటికి ఏకంగా వేల పేజీలో ఉంటుందట. వారూ వీరూ అని చూడకుండా అందరికీ హామీలు గుప్పిస్తారట. అబద్దాలకు ఆకాశమే హద్దు అన్నట్లుగా ఎన్ని అయినా చెబుతారుట. ఎందుకంటే చంద్రబాబుకు ఆ ఎన్నికల్లో కూడా తాను గెలవను అని పక్కాగా తెలుసట. దాంతో తీర్చేదా చేసేదా అని నోటికి ఎంత వస్తే అంత అన్నట్లుగా హామీలూ వరద పారిస్తారుట. ఆయినా చంద్రబాబుకు జనం అధికారం ఇవ్వరని కొడాలి నాని బాబు రాజకీయ భవిష్యత్తు మీద నాలుగేళ్ళ ముందే జోస్యం చెప్పేశారు. సో చంద్రబాబు ఇప్పటినుంచే 2024 ఎన్నికల కొరకు భారీ ఎత్తున ఇచ్చే హామీల పుస్తకం రాస్తున్నారు అనుకోవాలేమో

# రాపాక చెల్లని రూపాయినే

రాజమండ్రి, సెప్టెంబర్ 11, (న్యూస పల్స్)రాపాక వరప్రసాద్. సీనియర్ రాజకీయ నాయకుడే అయినా.. గత ఎన్నికల తర్వాత.. ఆయన అనుసరించిన వ్యూహంతోనే రాష్ట్ర వ్యాప్తంగా ఆయనంటే ఎవరో.. ఏం చేస్తున్నారో.. ప్రజలకు తెలిసింది. గత 2019 ఎన్నికల్లో ఆయన జనసేన తరఫున తూర్పు గోదావరి జిల్లా రాజోలు నియోజకవర్గం నుంచి పోటీ చేసి.. జగన్ సునామీని తట్టుకుని మరీ విజయం దక్కించుకున్నారు. అంతే కాదు.. పవన్ పెట్టిన పార్టీలో విజయం సాధించిన ఏకైక ఎమ్మెల్యేగా రాపాక వరప్రసాద్ గుర్తింపుసాధించారు. ఆయన అలా ఉండిపోయి ఉంటే.. పరిస్థితి వేరేగా ఉండేది. అప్పటి అధికార వైసీపీకి దగ్గరయ్యేందుకు అష్టకష్టాలు పడ్డారు. పేకాట కేసులో తన వర్గాన్ని పోలీసులు అరెస్టు చేయడంతో వైసీపీ సర్కారుపై నిప్పులు చెరిగిన ఆయన అనంతర కాలంలో అదే పార్టీకి మద్దతుదారుగా మారిపోవడంతో రాష్ట్ర వ్యాప్తంగా ఆయనపై చర్చ వచ్చింది. ఇక, అప్పటి నుంచి రాపాక వరప్రసాద్ వైసీపీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నారు. నిజానికి అప్పటికేసులో రాపాక వరప్రసాద్ కు అనుకూలంగా జనసేనాని పవన్ స్పందించారు. చిన్నపాటి వివాదాన్ని జగన్ ప్రభుత్వం రాజకీయం చేస్తోందని అన్నారు. అదేవిధంగా ప్రధాన ప్రతిపక్షాల నుంచి కూడా రాపాకకు మద్దతు లభించింది. కానీ, ఆయన ఏమనుకున్నారో.. ఏమో.. జనసేనకు దూరమై.. వైసీపీకి దగ్గరయ్యారు. ఆ తర్వాత.. సదరు కేసు ఏమైందో తెలియదు. ఇక, ఇప్పుడు అప్రకటిత.. వైసీపీ ఎమ్మెల్యేగా రాపాక వరప్రసాద్ కొనసాగుతున్నారు. అంతేకాదు.. ఇటీవల కాలంలో వైసీపీ మంత్రులతో కలిసి పలు అభివృద్ధి కార్యక్రమాల్లోనూ రాపాక కనిపిస్తున్నారు. వైసీపీ జెండా మోయకపోయినా.. వైసీపీ నేతగా ఆయన గుర్తింపు దక్కించుకుంటున్నారు.అయితే.. ఇది రాపాక వరప్రసాద్ కు కలిసి వస్తుందా ? అనేది మిలియన్ డాలర్ల ప్రశ్న. ఎందుకంటే.. రాజోలు నియోజకవర్గంలో వచ్చే ఎన్నిక ల్లో టికెట్ ఆశించేవారు పెరిగిపోయారు. వీరంతా కూడా పార్టీకి ఎప్పటి నుంచో అండగా ఉన్నవారు కూడా. వారిని కాదని.. రాపాక వరప్రసాద్ కు అవకాశం ఇస్తే.. పార్టీలో తిరుగుబాటు రావడం ఖాయంగా కనిపిస్తోంది. లేకపోతే.. కనీసం ఒకరిద్దరు.. స్వతంత్రులుగా పోటీకి దిగే ఛాన్స్ కూడా కనిపిస్తోంది. వైసీపీకి దగ్గర అయినా రాపాక వరప్రసాద్ స్థానిక నేతలతో కలివిడిగా లేకపోవడం.. తనదే ఆధిపత్యం అంటూ.. వ్యాఖ్యలు సంధించడం వంటి పరిణామాలు..

వైసీపీ నేతలకు ఆగ్రహం తెప్పిస్తున్నాయి. దీంతో ఆ జంపింగ్ వల్ల.. పార్టీ నాశనం కావడం ఖాయమని అంటున్నారు పరిశీలకులు. మరోవైపు.. రాపాక వరప్రసాద్ గెలుపునకు కృషి చేసిన.. ఎస్సీ యువత.. ఇప్పటికీ జనసేనతోనే ఉన్నారు. ఇటీవల జరిగిన స్థానిక సమరంలోనూ వీరు.. జనసేన మద్దతిచ్చిన వారికే మొగ్గు చూపారు. కాపులు అంతా రాపాక వరప్రసాద్ పై మండి పడుతున్నారు. స్థానిక ఎన్నికల్లో ఇక్కడ జనసేన సత్తా చాటి పట్టు నిలుపుకుంది. వైసీపీలో అక్కడ ఎంపీ అనూరాధ, అమ్మాజీ, బొంతు రాజేశ్వరరావు వర్గాలు ఉన్నాయి. వీళ్లలో వీళ్లకే పడడం లేదు. ఈ గొడవలు మున్ముందు పెరిగి.. వచ్చే ఎన్నికల నాటికి రాపాక వరప్రసాద్ కు తీవ్ర ఇక్కట్లు తప్పేలా లేవు. ఇటు వైసీపీ నేతలతో పొసగకపోవడం.. మరోవైపు.. జనసేనకు దూరం కావడం.. వంటివి రాపాక వరప్రసాద్ రాజకీయాలకు ఎండ్ కార్డు పడేసేలా ఉన్నాయి.

# జిల్లాల్లోని ఆర్టీసీ సైట్లు వాణిజ్య సముదాయాలు


కర్నూలు, సెప్టెంబర్ 11, (న్యూస్ పల్స్)మెరుగైన సౌకర్యాలతో రాష్ట్రంలోని ఆర్టీసీ బస్ స్టేషన్లను అప్‌గ్రేడ్ చేసి వాటిని ఇంటిగ్రేటెడ్ స్టేషన్లుగా మార్చాలని ఏపీఎస్ఆర్టీసీ నిర్ణయించింది. 150 కోట్ల వ్యయంతో దీన్ని నిర్మించనున్నారు. సంబంధిత బస్‌స్టేషన్లలో ప్రయాణీకులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడంతో పాటు, షాపింగ్ కాంప్లెక్సులు, సినిమా హాళ్లు కూడా నిర్మించబడతాయి అని.. ఈ స్టేషన్లు అంతర్జాతీయ ప్రమాణాల ప్రకారం నిర్మించబడతాయి అని.. అదనంగా, మెరుగైన సదుపాయాలు కల్పించడానికి మరో 21 బస్ స్టేషన్లను అప్‌గ్రేడ్ చేస్తున్నామని.. ప్రస్తుతం, మొత్తం ఐదు జిల్లాల్లోని ఆర్టీసీ సైట్లు వాణిజ్య సముదాయాలుగా మార్చబడుతున్నాయి అని తెలిపింది. అత్యాధునిక సౌకర్యాలతో, ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్యంలో (పిపిపి) ఐదు జిల్లాల్లో ఏడు ప్రదేశాలలో బస్ స్టేషన్లు ఏర్పాటు చేయబడతాయి. ఆర్కిటెక్చరల్ కన్సల్టెంట్ ఎంపిక కోసం ఆర్టీసీ ఇటీవల టెండర్లను పిలిచింది. ఇదిలావుండగా, ఈ ప్రాజెక్టు కోసం ఆటోనగర్ - విజయవాడ, హనుమాన్ జంక్షన్ (కృష్ణ), తిరుపతి (చిత్తూరు), మద్దిలపాలెం, నర్సిపట్నం (విశాఖపట్నం), కర్నూలు, నరసరావు పేట (గుంటూరు) ప్రాంతాలను ఎంపిక చేశారు. ప్రతి బస్‌స్టాండ్‌కు రూ .10 కోట్ల నుంచి రూ .25 కోట్ల మధ్య కేటాయిస్తారు. వైఫై, టాయిలెట్ విస్తరణ, రీ-పెయింటింగ్, ర్యాంప్‌లు, రెయిలింగ్‌లు, డిజిటల్ డిస్ప్లే బోర్డులు, మరిన్ని సౌకర్యాలు ఉన్నాయని.. అదనంగా, శ్రీకాకుళం, విజయనగరం, కాకినాడలలో బస్ స్టేషన్లను అప్‌గ్రేడ్ చేయనున్నారు అని ఎపిఎస్‌ఆర్‌టిసి నిర్ణయించింది అని అధికారులు తెలిపారు.

# పులస చేపల విక్రయాలు జోరు

ఏలూరు,సెప్టెంబర్ 11, (న్యూస్ పల్స్)అవి రుచిలో రారాజు ధరలోనూ రారాజే. అది సంవత్సరకాలంలో ఒక్కసారి మాత్రమే దొరికే అరుదైన చేప. ఇది ఒక్క గోదావరి జిల్లాల్లో మాత్రమే దొరకే పులస చేపల ప్రత్యేకత. గోదావరి జిల్లాల్లో వాడుకలో ఉన్న నానుడి ఏటంటే 'పుస్తెలు అమ్మి అయినా పులస కూర తినాలట' అని అంటుంటారు. ఇక వినడానికి మరీ ఎక్కువగా అనిపించినా పులస చేపలకున్న ప్రాధాన్యం అలాంటిది మరి.. అది పశ్చిమగోదావరి జిల్లా. జిల్లాలో పెనుగొండ మండలం సిద్దాంతం అనే గ్రామం ఒకటి. అక్కడికి సమీపంలోని వశిష్ఠ గోదావరి బ్రిడ్జి దగ్గర పులస చేపల విక్రయాలు జోరుగా కొనసాగుతాయి. ఈ నోరూరించే పులస చేపలు ఉభయగోదావరి జిల్లాలో తప్ప రాష్ట్రంలో మరీ ఎక్కడా దొరకవు. ఇప్పుడు గోదావరిలోకి ఎర్ర నీరు రావడంతో పులస చేపలు సందడి చేస్తున్నాయి. దీంతో జాలర్లు పులస చేపల వేటలో పడి బిజీ అయ్యారు. ఒక్క పులస చేప ఖరీదు దాదాపు వెయ్యి రూపాయల నుండి ఐదు వేల రూపాయలు పలుకుతోంది. ఇంత ధర ఎందుకంటే వెండి రంగులో ఉండే ఈచేప రుచి అంతాఇంతాకాదండోయ్. అంతేకాదు ఈచేప సంవత్సరానికి ఒక్కసారి మాత్రమే దొరికే అరుదైన చేప. అందుకే జనాలు ఎంత ధరైనా సరే వెనుకాడకుండా కొనుగోలు చేసి లొట్టలేసుకుని మరీ తింటారు. చెప్పాలంటే పులస చేపల ఆశ చూపితే సచివాలయంలోని ఫైల్స్ కూడా ఇట్టే కదులుతాయట. ఇక హిల్సా ఇలిషా పులస చేప శాస్త్రీయనామం. ఆరోహవలస జాతికి చెందిన పులస, ఇలాసగా జీవనం సాగిస్తుంది. సంతాన ఉత్పత్తి కోసం హిందూమహాసముద్రం నుండి బంగాళఖాతం చేరుకుని అక్కడి నుంచి సుదీర్ఘంగా ఈదుతూ గోదావరిలోకి వలసలుగా వస్తాయి. అయితే పులస చేపల పులుసు చేయడం కూడా అంతసులువు కాదంటున్నారు ఉభయగోదావరి జిల్లా వాసులు. పిడకల పొయ్యి మీద వెన్నరాసిన కుండలో వండిన కూర తింటే ఆరుచే వేరంటున్నారు.

# సోముతో కమల కలవరం

కాకినాడ, సెప్టెంబర్ 11, (న్యూస్ పల్స్)ఏపీలో శాపగ్రస్థ పాలన సాగుతోంది అని బీజేపీ పెద్ద సోము వీర్రాజు బాగానే అంటున్నారు. ఆయన సుదీర్ఘమైన లేఖ ఒకటి ముఖ్యమంత్రి జగన్ కి రాసి అందులో అప్పుల కుప్ప ఏపీని తయారు చేశారు అంటూ బండలు వేశారు కూడా. ఏపీకి గతి గత్యంతరం లేకుండా చేశారని నిప్పులు చెరిగారు. ఏపీని ఏం చేద్దామనుకుంటున్నారు అంటూ గద్దించారు. మరి బాధ్యత గల ప్రతిపక్షంగా సోము వీర్రాజుకు ఈ మాత్రం ఆవేశం ఉండడం సహజం. ఆయన నిలదీయాలనుకోవడం సమంజసమే. కానీ ఈ ప్రశ్నలు అడిగే ముందు కేంద్రంలో తమ ప్రభుత్వమే ఉందన్న సంగతిని సోము వీర్రాజు మరచారా అన్నదే ప్రశ్న.మాటకు వస్తే చాలు ఏపీకి ఎంతో చేశామని బీజేపీ నాయకులు డప్పాలు కొడతారు. కానీ అన్ని రాష్ట్రాలకు ఇచ్చిన మాదిరిగానే ఏపీకి ఇస్తున్నారు. అంతే తప్ప ఏపీకి ప్రత్యేకమైన ప్రేమతో ఏమైనా ఇచ్చారా అన్నది జనం అడుగుతున్న ప్రశ్న. ఇక ఏపీని అడ్డగోలుగా విభజించిన నాడు ఢిల్లీని తలదన్నే రాజధానిని నిర్మిస్తామని చెప్పిన మోడీ ఇపుడు ఏపీ ఊసు మరచిన సంగతి సోము వీర్రాజు కు గుర్తు లేదా అన్నదే పెద్ద డౌట్. ఏపీకి 2014లోనే అతి పెద్ద రెవిన్యూ లోటు ఉందని ఆయనకు తెలియదా. ఇక తాము పొత్తు పెట్టుకుని నాలుగేళ్ల పాటు చెట్టాపట్టాలు వేసిన తెలుగుదేశం ప్రభుత్వం చేసిన మూడు లక్షల కోట్ల అప్పులు గురించి ఆయన ఏనాడైనా ఇలా బాధ పడ్డారా అని కూడా అడిగితే ఏం జవాబు చెబుతారు.ఇల్లు కాలి ఒకడు ఏడుస్తూంటే మరొకడు చలి కాచుకున్నారని ముతక సామెత. ఇపుడు బీజేపీ సహా విపక్షాల తీరు అలాగే ఉంది. గల్లీలో గోల పెట్టడం, అధికారంలో ఉన్న ప్రభుత్వాన్ని పట్టుకుని విమర్శలు చేయడం తప్ప తమ సొంత రాష్ట్రం మీద ప్రేమ ఏ కాస్త అయినా ఉంటే దెబ్బ ఎక్కడ ఉందో అక్కడే కదా మందు వేయాలి అన్నది తెలియకపోవడమే విషాదం అంటున్నారు. కేంద్రంలో బీజేపీ ఉంది. సోము



వీర్రాజు సహా విపక్ష నేతలు అంతా ఏపీకి చెందిన వారు. ఏ కాస్తా సాయం అయినా ఏపీకి రప్పించి తెప్పిస్తే జనాలకు అది ఊరట. బీజేపీకి అది పొలిటికల్ గా మేలు చేస్తుంది. అంతే తప్ప పెద్ద మాస్టర్ లా బెత్తం పట్టుకుని ఏపీని శాపగ్రస్థ చేశారు అంటూ జగన్ని నిందించి ఏం ప్రయోజనం అంటున్నారు సగటు జనం.ఏపీకి ఈ దుస్థితి అంతా కలసి చేస్తేనే వచ్చిందని జనాలు అంటున్నారు. విభజన ఏపీ తొలి ముఖ్యమంత్రి చంద్రబాబు ఆర్భాటాలు. మలి ముఖ్యమంత్రి జగన్ అలవి కాని హామీలు, కేంద్రం ఉదాశీనత. ఢిల్లీ పెద్దలను ఎదిరించలేని ఏపీ రాజకీయ నేతల బలహీనతకలసి ఈ పరిస్థితిని తెచ్చాయని అంటున్నారు. చిత్రమేంటి అంటే ఇప్పటికైనా అంతా ఒక్కటి కాకపోవడం. ఏపీని ఆర్ధిక కష్టాల నుంచి బయట పడేయడానికి నిర్మాణాత్మకమైన సూచనలు ఇవ్వకపోవడమే బాధాకరం. ఇదే తీరున సాగితే మునుముందు ఏపీ ఇంకా దిగజారుతుందే తప్ప మరేమీ కాదు. ఇక మూడవ సారి ఎవరు అధికారంలోకి వచ్చినా కూర్చునేందుకు కుర్చీ కూడా ఉండదు అన్నది ఆర్ధిక పాఠం చెబుతున్న కఠోర సత్యం. ఇప్పటికైనా సోము వీర్రాజు లాంటి వారు జగన్ కి ప్రేమ లేఖలు రాయడం ఆపేసి ఢిల్లీ పెద్దలను కలసి ఏపీ కష్టాలు ఏకరువు పెడితే ఆయనకూ పార్టీకి మేలు అంటున్నారు అంతా.

# సర్కార్ ప్రైవేట్ లిమిటెడ్

విజయవాడ, సెప్టెంబర్ 11, (న్యూస్ పల్స్)ప్రభుత్వం అంటే ప్రజలకు అవసరమైన సదుపాయాలు, వసతులు కల్పిస్తూ శాంతి భద్రతలను పరిరక్షిస్తూ పరిపాలన చేయాలనేది విధానం. అన్నిటా తామున్నామంటూ అనవసరమైన బురద జల్లుకుంటుంటాయి కొన్ని సర్కారులు. జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం ఈ కోవలోనే తీసుకుంటున్న తాజా నిర్ణయం సినిమా టిక్కెట్లను ప్రభుత్వ వెబ్ సైట్ల ద్వారా విక్రయించాలనే ఆలోచన. ప్రజలకు ఏమాత్రం ఉపయోగపడని, ప్రభుత్వానికి సంబంధం లేని ఈ అమ్మకాల గోలపై ఇప్పటికే రచ్చ సాగుతోంది. అదనపు ఆదాయం వస్తుందనో, సినిమా పరిశ్రమ తమ గుప్పెట్లో ఉంటుందనో ఈ నిర్ణయం తీసుకుంటే అది బూమ్ రాంగ్ అయ్యే ప్రమాదమే ఎక్కువ. పైపెచ్చు సినిమా పరిశ్రమ నుంచి ప్రజల నుంచి కొంతమేరకు వ్యతిరేకత ఎదురయ్యే అవకాశాలున్నాయి. ఇప్పటికే కష్టాల్లో, నష్టాల్లో ఉన్న పరిశ్రమ నిండా మునిగిపోయే సూచనలున్నాయి. ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపరచాల్సిన ప్రభుత్వానికి ఈ కొసరు పనులు ఎందుకనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.మద్యం వ్యాపారాన్ని జగన్ ప్రభుత్వం ఇప్పటికే నియంత్రణలోకి తెచ్చుకుంది. దానివల్ల వేల కోట్ల రూపాయల ఆదాయం వచ్చిపడుతోంది. మద్యం వ్యాపారం చేయడమన్నది ప్రభుత్వానికి మంచి ఇమేజ్ ఇచ్చే విషయం కాదు. కానీ భవిష్యత్తులో నిషధం అమలు చేసే ఆలోచన ఉంది కాబట్టి నియంత్రించడానికి ఈ వ్యాపారంలోకి దిగినట్లుగా ప్రభుత్వం చెప్పింది. కానీ ఇప్పుడు ఆ ఆలోచనలు విరమించుకున్నట్లే. మద్యం నుంచి వస్తున్న ఆదాయాన్ని ష్యూరిటీగా చూపిస్తూ అప్పులు చేస్తోంది. అంటే భవిష్యత్తులో నిషేధం అమలుకు గండి పడినట్లే. తాగుబోతుల సంఖ్య పెరిగిపోతోంది కాబట్టి నిర్దిష్టవేళల్లో సక్రమంగా అమ్మకం చేయడానికి మద్యం షాపులు నిర్వహిస్తున్నామని చెబితే సరిపెట్టుకోవచ్చు. కానీ సినిమా టిక్కెట్ల అమ్మకాన్ని ఆ రకంగా సమర్థించుకోలేదు. ప్రభుత్వ దైనందిన కార్యక్రమాలకు, వినోద పరిశ్రమలో టిక్కెట్ల విక్రయానికి అసలు ఎటువంటి సంబంధమూ లేదు.ప్రజలకు అవసరమైన రహదారులు, ఉపాధి కల్పన, సేవలు, పన్నుల వసూళ్ళు, విద్య, వైద్య సదుపాయాలు ఇలా చూస్తే తలకు మించిన రాజ్యాంగబాధ్యతలు జగన్ ప్రభుత్వంపై ఉన్నాయి. సినిమా టిక్కెట్లు అమ్మడం ప్రభుత్వాల బాధ్యత కాదు. అందులోనూ ఇప్పటికే డిస్టిబ్యూటర్లు, ఎగ్గిబిటర్లుగా పక్కా వ్యవస్థీకృతమైన యంత్రాంగం ఉంది. అంతా సజావుగా సాగిపోతోంది. ప్రభుత్వానికి వినోదపన్ను రూపంలో భారీగానే ఆదాయం లభిస్తోంది. ఇప్పుడు టిక్కెట్ల వ్యాపారంలోకి దిగితే మళ్లీ యంత్రాంగాన్ని ఏర్పాటు చేసుకోవాలి. అమ్మకాల ద్వారా వచ్చిన ఆదాయాన్ని థియేటర్లు, ఎగ్జిబిటర్లు, నిర్మాతల మధ్య పంపిణీ చేయాలి. ఇదంతా పెద్ద తతంగం. సినిమా వ్యాపారానికి సంకెళ్లు వేసినట్లవుతుంది. పైపెచ్చు ఉద్యోగుల సహా పెద్ద వ్యవస్థను కొత్తగా నెలకొల్పుకోవాలి. పరిపాలనకు సంబంధించి సవాలక్ష కార్యక్రమాలు ఉండగా ఈ వాణిజ్య రంగంలో ప్రభుత్వం ప్రవేశించాలనుకోవడం దేశంలోనే ఇది తొలిసారి.ఒకప్పుడు తెలుగుసినీ పరిశ్రమ హిందీ పరిశ్రమకు దీటుగా వెలుగుతుండేది. సంఖ్యాపరంగా బాలీవుడ్ కంటే అత్యధిక సినిమాలు తెలుగులోనే నిర్మాణమవుతుండేవి. 2000 సంవత్సరం వరకూ ఈ ట్రెండ్ కొనసాగింది. దక్షిణాదిలో అత్యధిక వనరులు, థియేటర్లతో కళకళలాడే పరిశ్రమ క్రమేపీ దిగజారుతూ వచ్చింది. మొత్తం నిర్మాణ వ్యయంలో సగానికి పైగా హీరోల రెమ్యునరేషన్ చేరిపోవడం, సృజనాత్మకత లోపించడంతో తెలుగు సినిమాల పట్ల ప్రేక్షకులకే ఏవగింపు పెరిగింది. తమిళం, మళయాళం నుంచి వచ్చే డబ్బింగ్ చిత్రాలను ప్రజలు ఆదరించడం మొదలు పెట్టారు. దక్షిణాదిలో తన నంబర్ వన్ స్థానాన్ని కోల్పోయింది. రాష్ట్ర విభజన తర్వాత ఇది మరింతగా కనిపించింది. తెలుగులో తీస్తున్న పది సినిమాల్లో ఎనిమిది నష్టాల్లోనే ఉంటున్నాయి. కరోనా దెబ్బతో అత్యధికంగా నష్టపోయిన రంగమూ ఇదే. ఈ స్థితిలో పరిశ్రమను బ్రతికించడానికి ప్రభుత్వాలు సహకరించాల్సిన అవసరం ఉంది. కానీ తమ గుత్తాధిపత్యంలోకి సినిమాను తెచ్చుకోవాలనుకుంటే మొత్తం పరిశ్రమే దెబ్బతినే ప్రమాదం ఉంది. ఇప్పటికే ఓటీటీ వేదికల నుంచి పెద్ద పోటీ ఎదురవుతోంది. ఇక జగన్ సర్కారు జోక్యమూ పెరిగితే థియేటర్లు మూతపడటము, సినిమా నిర్మాణాలు నిలిచిపోవడమూ ఖాయమనే చెప్పాలి.

## యంగ్ టీమ్ తో కష్టమేనా...

గుంటూరు, సెప్టెంబర్ 11, (న్యూస్ పల్స్)చంద్రబాబుకు దాదాపుగా 2024 ఎన్నికలే చివరివి అని చెప్పుకోవాలి. ఎందుకంటే ఆయన వయోభారంతో ఉన్నారు. 2024 నాటికి బాబు వయసు డెబ్భై అయిదేళ్లకు చేరువ అవుతుంది. అక్కడ నుంచి మరో అయిదేళ్ళ వరకూ వేచి చూడడం అంటే కుదిరే పని కాదు. అందువల్ల చంద్రబాబు తాడో పేడో తేల్చుకోవడానికి ఈ ఎన్నికలనే తీసుకుంటున్నారు అంటున్నారు. ఇక లోకేష్ తనకంటూ యంగ్ టీమ్ ని ఏర్పాటు చేసుకుని వారికే టికెట్లు ఇవ్వాలని డిమాండ్ పెడుతున్నారుట. అయితే చంద్రబాబు మాత్రం ఏ హామీ ఇవ్వలేకపోతున్నారు అంటున్నారు. ఎందుకంటే చంద్రబాబుకు తెలుసు. వచ్చే ఎన్నికలు ఎంత గట్టిగా జరుగుతాయో. ఏ మాత్రం అనుభవం లేకపోయినా కూడా అధికార వైసీపీని తట్టుకోలేరు సరికదా పూర్తిగా తుళ్ళిపోతారు.దాంతో చంద్రబాబు సీనియర్లను విడిచిపెట్టడంలేదు అంటున్నారు. చంద్రబాబుకు ఆ విధంగా నమ్మకం కలుగచేసే యువ నాయకులు కూడా కనిపించడంలేదుట. ఆ మాటకు వస్తే లోకేష్ కూడా చంద్రబాబుకు ఈ రోజు వరకూ ఎటువంటి నమ్మకం కలిగించలేకపోయారు అన్నది కూడా నిజం. చినబాబు స్క్రిప్ట్ ప్రకారమే మాట్లాడుతున్నారు తప్ప స్పాంటేనియస్ గా మాట్లాడడం, జనాలను అకట్టుకోవడం, లోతైన విశ్లేషణ చేయడం వంటివి మాత్రం నేర్చుకోలేదని అంటున్నారు. ఈ పరిస్థితులలో లోకేష్ మాట వింటే ఇబ్బందే అని చంద్రబాబు అనుకుంటున్నారట.ఇక సీనియర్లలో ఓపిక ఉన్న వారు, మళ్ళీ పోటీ చేస్తే? జనాలలో గెలుపు అవకాశాలు ఉన్న వారికి టికెట్లు ఇవ్వడానికి చంద్రబాబు డిసైడ్ అయ్యారని తాజా టాక్. అంతే కాదు, 2024 ఎన్నికలలో ఎటువంటి కొత్త ప్రయోగాలు చేయకూడదని కూడా చంద్రబాబు భావిస్తున్నారుట. ఇది ప్రయోగాలకు సమయం కాదు అని కూడా ఆయన అంచనా వేసుకుంటున్నట్టు పార్టీ వర్గాలే చెప్పుకుంటున్నాయి. మరి చంద్రబాబు అధికారంలో ఉన్నపుడు కొత్త ఆలోచనలు చేయరు, విపక్షంలో ఉన్నపుడు కూడా అంతకంటే రిస్క్ చేయరు. ఇలాగైతే పార్టీలో కొత్త నీరు ఎలా వస్తుంది అన్నది తమ్ముళ్ల బాధగా ఉందిట. పేరుకు మాత్రం యువతకు టిక్కెట్లు ఇస్తాం.. యువతను ఎంకరేజ్ చేస్తామని చెపుతున్నా చేతల్లో మాత్రం అది లేదనే అంటున్నారు. అయితే చంద్రబాబు ఆలోచనలు కూడా ఈ సమయంలో కరెక్టే అని అంటున్న వారూ ఉన్నారు. ఒక విధంగా చెప్పాలంటే టీడీపీ అతి పెద్ద రాజకీయ సంక్షోభంలో ఉంది. చంద్రబాబు తప్ప మరో నాయకుడు వద్దు అనడం వల్లనే కదా అయన ఈ వయసులో కూడా భారాన్ని మోస్తోంది. అదే పరిస్థితి నియోజకవర్గాలలో ఉందిట. మొత్తానికి చంద్రబాబు ఎపుడూ సీనియర్లకే ఓటు చేస్తారు అన్నది మరో మారు రుజువు అవుతోంది అంటున్నారు.

## సినీఫక్కీలో దారి దోపిడీ?.. రహస్య విచారణ చేస్తున్న పోలీసులు

మైలవరం సెప్టెంబర్ 11, (న్యూస్ పల్స్)సినీఫక్కీలో జరిగిన దారి దోపిడీ కేసును పోలసులు రహస్య విచారణ చేస్తున్నారు. మైలవరం మండలం పుల్లూరులో శుక్రవారం తెల్లవారుజామున రు.7 లక్షలు దారి దోపిడీ జరిగిన విషయం తెలిసిందే. జయంతి నుంచి మండపేట కు రెండు లారీల్లో పి డి ఎస్ బియ్యం అక్రమంగా తరలించారు. బియ్యం అమ్మిన సొమ్ము ఏడు లక్షలు ఇద్దరు లారీ డ్రైవర్ లలో ఒకరికి అప్పగించారు. ఏడు లక్షల నగదు పై కన్నేసిన మరో లారీ డ్రైవర్.ఖమ్మం కు చెందిన దోపిడీ ముఠాతో కుమ్మక్కై నగదు దోపిడీ కి స్కెచ్ వేసారు. మైలవరం మండలం పుల్లూరు సమీపంలోని కోళ్ల ఫారాల వద్ద కు లారీలు రాగానే దోపిడీ ముఠా అడ్డగించింది. ముందు లారీ డ్రైవర్ కి వెనకాల లారీలో సొమ్ము ఎక్కడ ఉందో తెలియడంతో పది నిమిషాలలో సొమ్ము తీసుకొని దోపిడీ ముఠా పరారీ అయింది. బాధిత లారీ డ్రైవర్ మైలవరం పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసాడు. దోపిడీ విషయాన్ని గోప్యంగా ఉంచిన మైలవరం పోలీసులు విచారణ చేపట్టారు. ఇద్దరు లారీ డ్రైవర్ లపై అనుమానం తో అదుపులోకి తీసుకున్నారు. దాంతో అసలు విషయాన్నీ దొంగ డ్రైవర్ పోలీసులకు తెలిపాడు. ఖమ్మం లో స్పెషల్ టీమ్ తో దోపిడీ ముఠా కోసం గాలిస్తున్నట్లు సమాచారం. దోపిడీ ముఠా లో ఒక కానిస్టేబుల్ కొడుకు ఉన్నట్లు కుడా తెలిసింది.

## ప్రెస్, పోలీసు స్టిక్కర్ల సోదాలు

విశాఖపట్నం సెప్టెంబర్ 11, (న్యూస్ పల్స్)మీరు నడిపే వాహనం పైన పోలీస్ స్టిక్కర్ ఉందా.. ప్రెస్ అనే స్టిక్కర్ పెట్టుకొని ప్రయాణిస్తున్నారా.. నిజంగా మీరు పోలీస్ ఐతే పర్వాలేదు. జర్నలిస్టు అయితే ఇబ్బంది లేదు. మీరు అదే వృత్తి చేయకుండా స్టిక్కర్ పెట్టుకున్నారో తస్మాత్ జాగ్రత్త. విశాఖలో ఇలాంటి నకిలీ స్టిక్కర్ల పై దృష్టి పెట్టింది పోలీసుశాఖ. పోలీస్ కమిషనర్ ఆదేశాలతో విశాఖ పోలీసులు అప్రమత్తమయ్యారు. విశాఖపట్నం హనుమంతవాక మద్దిలపాలెం జంక్షన్ లో శనివారం ఉదయం ఏ డి సి పి ఆదినారాయణ, పర్యవేక్షణలో ఏసీపీ కుమారస్వామి సీఐ షణ్ముఖ ల నేతృత్వంలో తనిఖీలు చేపట్టారు. మద్దిలపాలెం లో నిర్వహించిన తనిఖీలలో ఊహకందని నకిలీ స్టికర్ల తో వాహనదారులు పట్టుబడ్డారు. అయితే వీరిలో కొంతమంది పోలీసు స్టిక్కర్లు తో దర్శనమిచ్చాయి. మరి కొంతమంది కార్ల పైన ప్రెస్ స్టిక్కర్లు తో చలామణి అయిపోతున్నారు . జిల్లా సరిహద్దులు దాటి ఆర్టీవో బోర్డు పెట్టుకుంటూ కారులో షికారు చేస్తున్న ఓ వ్యక్తిని పోలీసులు ప్రశ్నించి ఆర్టీవో బోర్డు తొలగించారు. అయితే వీరిలో కొంతమంది నిజమైన పోలీసులు జర్నలిస్టులు ఉండడంతో వారిని విడిచిపెట్టారు. మరికొంత మంది ప్రభుత్వ అధికారులు కార్లకు బోర్డులు పెట్టుకొని దర్జాగా తిరిగేస్తున్న దృశ్యాలు కనిపించాయి. ఇలా పోలీసులు ఊహించిన దానికంటే ఎక్కువ మంది నకిలీ స్టికర్లతో ప్రయాణించడం తో పోలీసు శాఖ మరి కొంతకాలం పాటు స్పెషల్ డ్రైవర్లు చేయాలని నిర్ణయించుకుంది. ప్రజల్లో చైతన్యం తెచ్చే అంతవరకూ డ్రైవర్ కొనసాగుతాయని పోలీసులు అధికారులు తెలిపారు. అయితే ఏ డిసిపి ఆదినారాయణ మాట్లాడుతూ ఇప్పటికే చాలా మంది నకిలీ స్టికర్లతో తిరుగుతున్నట్టు తమ దృష్టికి వచ్చిందని అలాంటి నకిలీలు తప్పించేందుకు ఈ స్పెషల్ డ్రైవ్ అన్నారు. ఈ డ్రైవ్ లో నిజమైన ఉద్యోగులకు ఎటువంటి ఇబ్బంది ఉండదని తెలిపారు. అయితే ప్రజల్లో చైతన్యం రావాల్సిన అవసరం ఉందన్నారు నాలుగు గంటల పాటు ఈ డ్రైవ్ నిర్వహించామన్నారు ఏడిసిపి ఆదినారాయణ.

## అప్పన్న సన్నిధితో స్వాతి నక్షత్ర నారసింహ హోమం

విశాఖపట్నం సెప్టెంబర్ 11, (న్యూస్ పల్స్) సింహాద్రి అప్పన్న స్వామి సన్నిధిలో స్వాతి నక్షత్ర సుదర్శన నారసింహ హోమాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా వేకువజామునే స్వామిని సుప్రభాత సేవతో మేల్కొలిపి ప్రభాత ఆరాధనలు పూర్తిచేశారు. సుదర్శన పెరుమాళ్ళు ప్రత్యేక పల్లకిలో కళ్యాణ మంపంలోని ప్రత్యేక వేదికపై ఉంచి మండపారాధన, కలశారాధనలు చేశారు.పాల్గొన్న భక్తుల గోత్రనామాలతో నృసింహ అష్టోత్తర శతనామార్చనలు చేసి అగ్నిప్రతిష్టాపన గావించారు. పంచసూక్తాలు, నృసింహ, సుదర్శన గాయత్రీ మంత్రాలతో ప్రత్యేక హవనం చేసి పూర్ణాహుతి చేశారు. పాల్గొన్న భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలను, తీర్థ ప్రసాదాలను అందజేశారు.

## మోడీ, జగన్..మధ్యలో చంద్రబాబు



హైదరాబాద్, సెప్టెంబర్ 11, (న్యూస్ పల్స్)చంద్రబాబుని అందుకే రాజకీయ చాణక్యుడు అనాలి. ఆయన ఏపీలో ట్రయాంగిల్ లవ్ స్టోరీని నడుపుతున్నారు. ఆయన ఎవరినీ వదులుకోరు. అలాఅని ఎవరికీ దూరం చేసుకోరు. ఆ మాటకు వస్తే ఆయన ఏపీలో పొత్తు పెట్టుకోనిదీ ఒక్క వైసీపీతో మాత్రమే. ఎందుకంటే అదే టీడీపీకి అసలైన ప్రత్యర్ధి కాబట్టి. ఇదిలా ఉంటే ఏపీ రాజకీయాలు అస్పష్టంగా గందరగోళంగా మారడానికి చంద్రబాబే కారణమని జాతీయ స్థాయిలో కూడా చర్చ సాగుతోంది. ఏపీలో చూసుకుంటే జగన్ తీరు కచ్చితంగా ఎవరైనా చెప్పగలరు. ఆయన జాతీయ స్థాయిలో ఎవరితో కలుస్తారు, ఎవరితో కలవరు అన్నది కూడా చెప్పేయవచ్చు. కానీ చంద్రబాబు విషయంలో అది ఎవరూ చెప్పలేరు.ఏపీలో బీజేపీ విషయం తీసుకుంటే జగన్ వైపే మొగ్గు చూపుతోంది. జగన్ తో కలసి ముందుకు సాగాలని కేంద్రంలోని మోడీ,అమిత్ షాల కచ్చితమైన ఆలోచనగా చెబుతున్నారు. అదే చంద్రబాబుతో కలిస్తే ఆయన ఎక్కడ ముంచుతాడో అన్న డౌట్లు వారిద్దరికీ ఉన్నాయని చెబుతున్నారు. అయితే ఏపీలో జగన్ తో బీజేపీని కలవనీయకుండా ఎన్ని చేయాలో అన్నీ తెర వెనక చంద్రబాబు చేస్తున్నారు అంటున్నారు. ఆయన బీజేపీలోకి పంపించిన ఎంపీలు కూడా ఈ విషయంలో తెగ బిజీగా ఉన్నారు. అంతే కాదు బీజేపీ పెద్దలు కోరకపోయినా ఆఫర్లు డిస్కౌంట్లూ ఇస్తూ చంద్రబాబు వారిని ఆకట్టుకోవాలని చూస్తున్నారుట.ఇక చంద్రబాబు బీజేపీతో కలసి వెళ్తామని ఒక వైపు చెబుతున్నా జాతీయ స్థాయిలో విపక్ష కూటమిలోనూ ఆయన మిత్రులు ఉన్నారు. వారితో కూడా ఆయన సన్నిహితంగానే ఉంటున్నారని అంటున్నారు. అంటే బాబు డ్యూయల్ రోల్ ప్లే చేస్తున్నారు అన్న మాట. ఈ రోజు కేంద్రంలో బీజేపీ అధికారంలో ఉంది. వారితో సఖ్యతగా లేకుంటే ఇబ్బంది అన్న ముందు చూపుతోనే చంద్రబాబు ఇలా చేస్తున్నారు అనుకోవాలి. అంతే తప్ప నిజంగా బీజేపీతో కలసి 2024 ఎన్నికలకు వెళ్తామని బాబు డేరింగ్ గా చెప్పలేరు. దానికి కారణం కేంద్రంలో మోడీకి తగ్గుతున్న క్రేజ్. ఇక విపక్షాలు కనుక పుంజుకుంటే చాలా సులువుగా ఆయన అవతల వైపు వెళ్ళిపోగలరు. అయితే ఆయన ఎక్కడా బయటపడరు. ఆయన కనుక ఏపీలో కాంగ్రెస్ తో జట్టు కడితే బీజేపీ పని సులువు అవుతుంది. కానీ ఆయన మాత్రం నేనున్నాను అంటూ కవ్విస్తున్నారు. దీంతోనే గందరగోళంగా రాజకీయం మారుతోంది.ఎట్టి పరిస్థితుల్లో బీజేపీ జగన్ కలిస్తే మాత్రం ఏపీలో మరో మారు అధికారం దక్కదు అన్న భయాలు ఏవో చంద్రబాబుకు ఉన్నాయి. అలాగని మోడీ ది గ్రేట్ అంటూ ఆయన్ని భుజానికి ఎత్తుకునేంత సాహసం ఆయన చేయలేకపోతున్నారు. అందువల్లనే ఆయన బీజేపీని దువ్వుతూ జగన్ కి దూరం చేసే పనిలో బిజీగా ఉన్నారు. చంద్రబాబు స్ట్రాటజీ చూస్తూంటే ఎన్నికలలో బీజేపీతో పొత్తు పెట్టుని కూడా ఆనక జెండా మార్చేసి విపక్ష కూటమిలోకి వెళ్ళిపోగలరు. అలా ఆయన ఒక్క దెబ్బకు అటు బీజేపీ, ఇటు జగన్ అవకాశాలను చిత్తు చేయాలని మాస్టర్ ప్లాన్ వేస్తున్నారు. ఇక్కడ చంద్రబాబుకు ఇంకో వెసులుబాటు కూడా ఉంది. జగన్ ఎట్టి కాంగ్రెస్ కూటమి వైపు చూడరన్నదే ఆయన గట్టి ధీమా. అందువల్ల ఏపీ రాజకీయాలను, పొత్తులను బాబు తనదైన శైలిలో ప్రభావితం చేస్తున్నారు. బాబు తీరుతో అటు బీజేపీ జగన్ మాత్రమే కాదు కాంగ్రెస్ కూడా ఇబ్బంది పడాల్సి వస్తోంది అంటున్నారు.

## కాణిపాకంలో వార్షిక బ్రహ్మోత్సవాలు

కాణిపాకం సెప్టెంబర్ 11, (న్యూస్ పల్స్)కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలకు ఈరోజు అంకురార్పణ జరిగింది. ఉదయం ఆలయంలో అర్చకులు, వేదపండితులు ధ్వజారోహణం కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు ముందుగా ధ్వజస్తంభం పై ఉన్న మూషిక పటానికి ప్రత్యేక పూజలు చేసి మూషిక పటాన్ని ధ్వజస్తంభం పైకి ఎగురవేసి కాణిపాకం బ్రహ్మోత్సవాలకు బ్రహ్మాది దేవతలని ఆహ్వానించారు అనంతరం స్వామివారి పటానికి పంచాబృత అభిషేకాలు నిర్వహించి ధూప ,దీప నైవేద్యాలు సమర్పించారు 21 రోజులపాటు జరిగే స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈరోజు నుంచి స్వామివారి కి తొమ్మిదిరోజుల పాటు నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తారు. అనంతరం 12 రోజులపాటు ప్రత్యేక ఉత్సవాలు నిర్వహిస్తారు. కరోనా నేపథ్యంలో గత సంవత్సరం లాగానే ఈ సంవత్సరం కూడా స్వామివారి బ్రహ్మోత్సవాలలో భాగంగా నిర్వహించే గ్రామోత్సవాలు రద్దుచేసి కేవలం ప్రాకారోత్సవం మాత్రమే నిర్వహిస్తున్నారు. ప్రతిరోజు ఆలయ ఉభయదారులుచే స్వామివారు ప్రతిరోజు ఒక్కో వాహనంపై ఉరేగుతారు. ఈ కార్యక్రమాలలో తక్కువ సంఖ్యలో ఉభయదారుల ను అనుమతిస్తామని ఆలయ ఈఓ వెంకటేష్ తెలిపారు.




## నెల్లూరు లో ఫిట్ ఇండియా ఫ్రీడం రన్

నెల్లూరు సెప్టెంబర్ 11, (న్యూస్ పల్స్)నెల్లూరు లో " ఫిట్ ఇండియా ఫ్రీడం రన్ " కార్యక్రమాన్ని బిజెపి రాష్ట్ర ప్రధానకార్యదర్శి, నెహ్రూ యువకేంద్ర నేషనల్ వైస్ చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా స్థాయి యువజన, క్రీడా మంత్రిత్వ శాఖ అధికారులు పాల్గొన్నారు. విష్ణువర్ధన్ రెడ్డి మాట్లాడుతూ కేంద్ర సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా 75 వారాల పాటు "అజాది కా అమృత్ మహోత్సవ్" కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. ఈ కార్యక్రమంలో భాగంగా దేశ వ్యాప్తంగా నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో అన్ని జిల్లాల్లో " ఫిట్ ఇండియా ఫ్రీడం రన్ " నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ శాఖలు భాగస్వామ్యం అవ్వాలని కోరుకుంటున్నాను. 2047 లో దేశం ఎలా ఉండాలి అని యువత తమ అభిప్రాయాలను కేంద్ర ప్రభుత్వానికి తెలియజేయవచ్చు . మన స్వాతంత్ర సమరయోధుల సందేశాలను భావితరాలకు అందించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్నాము. ఈ కార్యక్రమాలలో స్వచ్ఛందంగా యువత మరియు యువజన సంఘాల ప్రతినిధులు పాల్గొనాలని పిలుపునిస్తున్నాను. మన దేశం ఈ 75 సంవత్సరాలలో, ప్రపంచంలోని వివిధ దేశాలకు సహాయ సహకారాలను అందించింది. ప్రపంచంలో భారత్ ఒక గొప్ప దేశంగా ఎదగాలి. అందుకు ఆర్థికంగా, సామాజికంగా, సాంస్కృతికంగా మరియు విద్యాపరంగా అభివృద్ధి చెందాలి. ప్రపంచంలో అత్యధిక యువ శక్తి కలిగిన దేశం మనది. నవ భారత నిర్మాణంలో ఈ యువత పాత్ర కీలకమైనది. ప్రపంచం పటంలో భారత్ ఒక విశ్వగురువుగా నేడు నరేంద్ర మోడీ నాయకత్వంలో అవతరించబోతోంది. దేశ స్వాతంత్రం కోసం పోరాడిన ఎందరో మహనీయులు మన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఉన్నారు. వారిలో ముఖ్యంగా పింగళి వెంకయ్య, ,అల్లూరి సీతారామరాజు, కడప కోటిరెడ్డి, కల్లూరు సుబ్బయ్య, ముతరాజు గోపాల్ రెడ్డి తదితరులున్నారని అయన అన్నారు.

## రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పాలనలో ప్రజలు సుభిక్షంగా ఉండాలి

**రాష్ట్ర ఉపముఖ్యమంత్రి ఎస్.బి.అంజాద్ బాషా**

**అజ్మీర్ షరీఫ్ దర్గాలో పూల చద్దార్ సమర్పించి ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించిన ఉపముఖ్యమంత్రి**

కడప, సెప్టెంబర్ 11: రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పాలనలో ప్రజలు ఆరోగ్యంగా, ఆర్థికంగా సుభిక్షంగా ఉండాలని, రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సంకల్పం, ఆశయాలు సర్వం సిద్దించాలని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి ఎస్.బి.అంజాద్ బాషా ఆకాంక్షించారు.ఈ మహత్తర కార్యంలో భాగస్వామ్యం అవ్వడం నా అదృష్టంగా భావిస్తున్నానని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి అంజాద్ బాషా అన్నారు. శుక్రవారం మత సామరస్యానికి ప్రతీక అయిన రాజస్థాన్ లోని అజ్మీర్ షరీఫ్ "సుఫీ సెయింట్ హజరత్ ఖ్వాజా మొయినుద్దీన్ చిష్టి" పవిత్ర దర్గాను.. రాష్ట్ర ఉపముఖ్యమంత్రి అంజాద్ బాషా సందర్శించి, పూల చద్దార్ సమర్పించి ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఉపముఖ్యమంత్రి అంజాద్ బాషా మాట్లాడుతూ.. మతాలకు అతీతమైన అజ్మీర్ షరీఫ్ దర్గాను సందర్శించడం.. నా అదృష్టంగా భవిస్తున్నానన్నారు. మహిమాన్వితమయిన ఈ దర్గాకు లక్షలాదిమంది భక్తులు విచ్చేస్తున్నారంటే భక్తులకు ఈ పుణ్యస్థలంపై ఉన్న నమ్మకం, ప్రజల ఆదరణనే అన్నారు.దేశానికే స్ఫూర్తి దాయకమైన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సంక్షేమ పాలనలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ఆ భగవంతుణ్ణి కోరుకుంటున్నామన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి, ముస్లిం మైనార్టీల కోసం ఎన్నో సంక్షేమ పథకాలను అమలు పరిచి.. ఆంధ్ర రాష్ట్ర ముస్లిం మైనారిటీ ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్నారన్నారు. ప్రత్యేకించి అందరికీ సమ న్యాయం అంటూ.. ఒక మైనారిటీ ఎమ్మెల్యేకి ఉపముఖ్యమంత్రి పదవిని అందించడం.. రాష్ట్ర వ్యాప్తంగా ముస్లిం సోదరులు మొత్తం గర్వించదగ్గ విషయం అన్నారు. అలాంటి ఆదర్శ ముఖ్యమంత్రిపై ఆ భగవంతుడి దయ, ఆశీస్సులు, అనుగ్రహం ఎల్లవేళలా ఉంటాయన్నారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఎప్పటికి ఉండాలని... భవిష్యత్ లో రాష్ట్ర ప్రజలకు మరిన్ని సంక్షేమ పథకాలు అందించాలని.. కరోనా లాంటి విపత్కర పరిస్థితులన్నీ సమసి.. రాష్ట్రం ఆర్థికంగా మరింత అభివృద్ధి చెందాలని.. రాష్ట్ర ప్రజలపై.. ఆ దైవాశీస్సులు ఎల్లవేళలా ఉండాలని.. ఉప ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉపముఖ్యమంత్రి వెంట.. ఆయన సోదరుడు ఎస్.బి.అహ్మద్ బాషా, తదితరులు పాల్గొన్నారు.

## కాల్వపై మండిపడ్డ జేసీ

అనంతపురం అనంతపురం జిల్లా టీడీపీలో విభేధాలు భగ్గుమన్నాయి. రాయలసీయ టీడీపీ నేతలు తలపెట్టిన సదస్సుపై జేసీ ప్రభాకర్ రెడ్డి తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేసారు. ఇదంతా కాల్వ శ్రీనివాసులు కనుసన్నల్లో జరుగుతోంది. ముందుగా కార్యకర్తల గురించి సమావేశం పెట్టాలి.. నీటి కోసం కాదని అయన అన్నారు. వీరంతా హంద్రీనీవా కాల్వలపై తిరుగుతున్నారంటే.. ఏదో అనుమానం వస్తోంది. వీరు వైసీపీతో కుమ్మక్కైయ్యారేమోనని అనుమానం వస్తోంది. ఇద్దరు నేతలు పార్టీని నాశనం చేస్తున్నారు... వారి పేర్లు త్వరలోనే చెబుతా. చేతకాని వ్యక్తి నీటి కోసం పోరాడుతారా.. ఒక్క కార్యకర్త అయినా వెంట వస్తారా అని పరోక్షంగా మాజీ మంత్రి కాల్వ శ్రీనివాసులు పై ఆగ్రహం వ్యక్తం చేసారు.



## వినాయకుడికి పూజలు చేసిన అమీర్ బాషా

కడప సెప్టెంబర్ 11 వినాయక చవితి సంధర్భంగా కడప నియోజకవర్గ తెదేపా బాధ్యులు వి.ఎస్.ఆమీర్ బాబు నగరంలోని అప్సర థియేటర్ దగ్గర ఉన్న వినాయక స్వామి దేవాలయంలో పూజలు నిర్వహించి.. దేవదేవుడైన గణనాథుని ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా వి.ఎస్.అమీర్ బాబు గారు మాట్లాడుతూ సకల దేవతాగణాలకు అధినాయకుడు, తొలి పూజలందుకొనే ఏకదంతుడు, అవరోధాలు తొలగించే విఘ్నేశ్వరుడు, భక్తులను కరుణించే ఆ లంబోధరుని ఆశీస్సులతో ప్రపంచ వ్యాప్తంగా అలుముకొని ఉన్న కరోనా మహమ్మారి పీడ వదిలిపోయి ప్రజలంతా సుఖసంతోషాలతో.. ఆయురారోగ్యాలతో జీవించాలని కోరుకొంటూన్నాను. ఆంధ్రప్రదేశ్ లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రజలు స్వేచ్ఛగా, తమ జీవితాన్ని గడపాలని.. ఈ అసురాసుర వైసీపీ ప్రభుత్వం బారీ నుంచి అన్ని వర్గాల ప్రజలు ప్రత్యేకంగా మహిళలు నిర్భయంగా జీవించే పరిస్థితులు నెలకొనేలా చేయాలని ఆ గజానును ప్రార్థించానని అన్నారు. ఇందులో నగర అధ్యక్షుడు సానపురెడ్డి శివకొండారెడ్డి, సానపురెడ్డి రవిశంకర్ రెడ్డి, సి.ఎస్.నాసర్ అలీ పాల్గొన్నారు.

## మైదుకూరు ఘటనపై స్పందించిన జిల్లా ఎస్పీ

కడప సెప్టెంబర్ 11, (న్యూస్ పల్స్) శుక్రవారం జరిగిన మైదుకురు ఘటన పై జిల్లా ఎస్పీ అన్బు రాజన్ స్పందించారు. శనివారం అయన మీడియాతో మాట్లాడారు. మైదుకురులో ఫేస్ బుక్ ద్వారా ఒక సంఘటన నా దృష్టికి వచ్చింది. నిన్న కుటుంబం ఆత్మహత్య చేసుకుంటుందని వీడియో సందేశం చూసాను. అక్బర్ బాషా ఈ నెల 9 న స్పందనలో ఒక పిటిషన్ పెట్టారు. వెంటనే వారికి న్యాయం చేయాలని సంబంధిత అధికారులకు చెప్పాం. మైదుకూరు సీఐ కొండారెడ్డి దురుసుగా ప్రవర్తించారని బాధిత కుటుంబం ఆరోపించింది. అడిషనల్ ఎస్పీ స్థాయిలో అధికారానికి విచారణ అధికారి గా నియమించామని అన్నారు. మైదుకురు రూరల్ సిఐ కొండారెడ్డి ని విచారణ అయ్యేంత వరకు విధుల నుంచి తప్పిస్తున్నాం.

# భక్తిశ్రద్ధలతో వినాయక వేడుకలు జరుపుకుందాం

## మైనార్టీ లీడర్ షేక్షావలికౌతాళం మండల కేంద్రంలో ముస్లిం మైనారిటీ లీడర్ షేక్షవాలి ఆధ్వర్యంలో వినాయక చవితి వేడుకలు....

కౌతాళం సెప్టెంబర్ 11,( విభారె) , మండల కేంద్రం ముస్లిం మైనారిటీ కార్యదర్శి షేక్షవాలి వినాయక చవితి సంధర్భంగా వైఎస్సార్ కాలనిలో వినాయక చవితి వేడుకలు ఘనంగా



నిర్వహించారు. కావున తమెల్లరు బంధుమిత్రులతో కుటుంబం సభ్యులతో వినాయక మంటపంకు విచ్చేసి పూజలో పాల్గొని వినాయక ఆశీస్సులు పొందవలేరని అలాగే కులాల మధ్య చిచ్చు పెట్టె వారిని దూరంగా ఉంచాలని అన్ని కులాల దేవుళ్లు అందరూ ఒకటేనని ఆయన అన్నారు. మండలం లో వినాయక చవితి వేడుకలు అందరూ సంతోషంగా, జరుపుకోవాలని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు రానివ్వకుండా, కరోన మహమ్మారి తరిమికొట్టి దేశ ప్రజలను ఆరోగ్యంగా ఉండాలని,కుటుంబ సభ్యులతో సంతోషంగా ఉండాలని ఆ గణనాథుడుని అందరూ వేడుకోవలని కోరుచున్నానని ఆయన అన్నారు అలాగే కార్యక్రమాలకు విజయవంతం చేయాలని కోరుతున్నానని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో వినాయక సభ్యులు పాల్గొన్నారు.

# వికలాంగుల సామాజిక పెన్షన్ల తొలగింపుపై సోమవారం - 13న ఎంపిడిఓ కార్యాలయ ముట్టడికి తరలి రాండి



## తాలుకా విహెచ్పిఎస్ అధ్యక్షులు కె. రామాంజినేయులు, ఆర్గనైజింగ్ కార్యదర్శి బి. సి. నాగరాజు

ఎమ్మిగనూరు సెప్టెంబర్ 11,( విభారె) -శనివారం ఉదయం 10 గంటలకు ఎమ్మిగనూరు టౌన్ లోని ఎమ్మార్వో కార్యాలయ ఆవరణలో " వికలాంగుల సంక్షేమ హక్కుల సాధన సమితి" ఆధ్వర్యంలో తాలుకా అధ్యక్షులు కె. రామాంజినేయులు, ఆర్గనైజింగ్ కార్యదర్శి బి. సి. నాగరాజు లు పత్రిక విలేకరులతో మాట్లాడుతూ నేడు ఈ అధికారిక వైసీపీ రాష్ట్ర ప్రభుత్వం వికలాంగులకు సంబంధించిన సామాజిక పెన్షన్ల తొలగింపుపై తీసుకున్న నిర్ణయం మూలిగే నక్క మీద తాటి కాయ పడ్డట్టుగా ఉందని, వికలాంగుల పింఛన్లు తొలగిస్తే చాలా మంది రోడ్డున పడతారని, అసలే ఇటు జీవనోపాధి, అటు కుటుంబసభ్యుల ఆదరణ లేక నానా అవస్థలు పడుతు, తీవ్ర ఇబ్బందులు పడుతున్న వారి పెన్షన్లు తొలగించే ప్రయత్నం మానుకోవాలని సూచించారు, అనవసరంగా, హేతుబద్ధంగా, అన్యాయంగా ఈ అధికారిక ప్రజా ప్రభుత్వం, పాలకులు తీసుకున్న ఈ నిర్ణయం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ వికలాంగులు, వికలాంగుల సంఘాల నాయకులు సోమవారం - 13వ తారీఖున రాష్ట్ర, అన్ని జిల్లా, తాలూకా, మండల స్థాయిలోని ఎమ్మార్వో, ఎంపిడిఓ కార్యాలయ ముట్టడికి తరలి రావాలని, తదనంతరం ప్రభుత్వ అధికారులకు వినతి పత్రాలు సమర్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో భారీ ఎత్తున సామాజిక పెన్షన్లు తొలగించబడిన వికలాంగులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.. ఈ కార్యక్రమంలో విహెచ్పిఎస్ న్యాయ సలహాదారుడు ఈ. లింగన్న గౌడు, మాజీ ఎంపీటీసీ కె. విజయలక్ష్మి, నర్సింహులు, పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

# భవిష్యత్తులో రైతులపై విద్యుత్ ఛార్జీల భారం వేయడమే ప్రభుత్వ లక్ష్యం

## పెంచిన విద్యుత్ చార్జీలకు నిరసనగా ధర్నా

## పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించకుంటే పోతే తీవ్ర ఆందోళన చేస్తాం

## సీపీఐ. నియోజకవర్గ కార్యదర్శి.భాస్కర్ యాదవ్




మంత్రాలయం సెప్టెంబర్ 11,( విభారె) : రైతులకు విద్యుత్ మీటర్లు బిగించి విద్యుత్ చార్జీలు చెల్లిస్తామని ప్రభుత్వం మాయమాటలు చెబుతూ భవిష్యత్తులో రైతుల పై విద్యుత్ చార్జీలు పెంచడమే లక్ష్యంగా ముందుకు వెళుతుందని అలాగే పెంచిన విద్యుత్ చార్జీలను వెంటనే తగ్గించకపోతే రాష్ట్ర వ్యాప్తంగా తీవ్ర ఆందోళనలు నిర్వహిస్తామని సీపీఐ. నియోజకవర్గ కార్యదర్శి.భాస్కర్ యాదవ్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. పెంచిన విద్యుత్ చార్జీలకు నిరసనగా స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్ దగ్గర రైతులు ,రైతు సంఘాల నాయకులతో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కరోనా కష్టకాలంలో రైతులకు విద్యుత్ చార్జీలు తగ్గించడం పోయి సీఎం. జగన్ మోహన్ రెడ్డి రైతుల పై విద్యుత్ చార్జీలు పెంచడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. రీడింగ్ తో సంబంధం లేకుండా విద్యుత్ ఛార్జీల పెంచుతున్నారని విద్యుత్ బిల్లులు చెల్లించలేక ప్రజలు పేదవారు మధ్య తరగతి వారు ఆందోళన చెందుతున్నారని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో కూడా కేంద్ర ప్రభుత్వం గ్యాస్ వినియోగం పై 200 రూపాయలు సబ్సిడీ ప్రజలకు ఇస్తామని ఇప్పుడు కేవలం 40 రూపాయలు మాత్రమే సబ్సిడీ ఇస్తుందని తెలిపారు. ఎంతమందికి గ్యాస్ సబ్సీడీ పడుతుందో ఎంతమందికి లేదో ఇప్పటికీ ప్రజలకు అర్థం కావడం లేదన్నారు. విద్యుత్ ఛార్జీలను పెంచబోనని ప్రజలను నమ్మించి మోసం అధికారంలోకి వచ్చిన జగన్ మోహన్ రెడ్డి వచ్చిన రెండేళ్ల లోపే పేద మధ్యతరగతి ప్రజలపై విద్యుత్ ఛార్జీలు మోయలేని విధంగా విద్యుత్ చార్జీలు పెంచారని ఆందోళన వ్యక్తం చేశారు. పెంచిన విద్యుత్ చార్జీలు వెంటనే తగ్గించకపోతే రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర ఆందోళన చేస్తామని ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కారిక్రమంలో రైతు సంఘం నాయకులు ఉసేని ,హనీఫ్ .విద్యార్థి సంఘ నాయకుడు థామస్ ,వీరభద్ర ,నాగరాజుఅల్లాభకాష్ ,ఈరన్న తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలు కాంగ్రెస్ వైపు చూస్తున్నారు

## కర్నూలు డీసీసీ అహ్మద్ అలీఖాన్

కర్నూలు సెప్టెంబర్ 11,( విభారె) కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాల వల్ల ప్రజలు విసిగిపోయి మరలా కాంగ్రెస్ వస్తే బాగుంటుందని ప్రజల్లో ఆలోచన మొదలైందని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు శ్రీ అహ్మద్ అలీఖాన్ ఈ రోజు జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన డిసిసి కార్యవర్గ సమావేశంలో అధ్యక్షత వహించి సభ్యులనుద్దేశించి ప్రసంగించారు. కేంద్రం గ్యాస్ ధరలు పెంచడమేగాక ప్రభుత్వ ఆస్తులయిన రైల్వేలు, పరిశ్రమలు, ప్రభుత్వ స్థలాలు అమ్మి వేస్తుందని ఇలాంటి చర్యల వల్ల వచ్చే తరాల వారికి విద్య ఉపాధి అవకాశాలు పూర్తిగా కనుమరుగు అవుతాయని అలాగే రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం ప్రపంచంలో ఎక్కడాలేని కొత్త రకం పన్నులు కనుగొన్నారని చెత్తపై పన్ను వేసి గతంలో ఏ ప్రభుత్వం ఏ ముఖ్యమంత్రి చేయని సాహసం చేసి ప్రజలతో శాపనార్థాలు తింటున్నారని దేశ ప్రధాని, రాష్ట్ర ముఖ్యమంత్రి ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు తుంగలో తొక్కారని అలీ ఖాన్ గారు విమర్శించారు. అలాగే కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ స్థాయి, మండల స్థాయి కమిటీలు అన్ని అనుబంధ సంస్థల కమిటీలు త్వరగా పూర్తిచేయాలని నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్చార్జీలకు సూచించారు. డీసీసీ ప్రధాన కార్యదర్శి కాశింవలి, కర్నూలు నగర కాంగ్రెస్ అధ్యక్షులు జాన్ విల్సన్, నియోజకవర్గ కాంగ్రెస్ ఇంఛార్జీలు బి నీలకంఠప్ప, దామోదరం రాధాకృష్ణ, ఎస్ బాబు రావు, నాగరాజు యాదవ్ జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు మారుతీరావు జిల్లా ఎన్ఎస్యుఐ అధ్యక్షుడు వీరేష్ యాదవ్ సేవాదళ్ చైర్మన్ సజ్జాద్ హుస్సేన్, జిల్లా ఐఎన్టీయూసీ అధ్యక్షుడు బీ బతకన్న కిసాన్ సెల్ పోతుల శేఖర్ బీసీసెల్ న్యాయవాది మద్దులేటి డాక్టర్స్ సెల్ అమరేందర్రెడ్డి ఎస్సీసెల్ ఎస్ఈశ్వర్ డీసీసి కార్యదర్శులు అభినాయుడు షబ్బీర్, నూర్,రియాజ్, నగర కాంగ్రెస్ సెక్రెటరీలు ఉస్తాద్ ఇమ్రాన్ ఇర్ఫాన్ అసిఫ్ రాకేష్ రెడ్డి ఖాజా హుస్సేన్ షరీఫ్ అంజదుల్లాఖాన్ బి వి సుబ్రహ్మణ్యం బాలాజీ ప్రసాద్ మహిళా కాంగ్రెస్ శ్రీమతి సారమ్మ ప్రమీల మద్దమ్మ కెవిలక్ష్మీ ఎల్లమ్మ మొదలగు వారు పాల్గొన్నారు

# గ్రామ, వార్డు సభలను జిల్లా వ్యాప్తంగా జరపాలి

## ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక రాష్ట్ర బాధ్యులు డా.బ్రహ్మారెడ్డి

కర్నూలు సెప్టెంబర్ 11,( విభారె) : గ్రామ, వార్డు సభలను కర్నూలు జిల్లా వ్యాప్తంగా జరపాలని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక రాష్ట్ర బాధ్యులు డా.బ్రహ్మారెడ్డి డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక జిల్లా సమావేశం శనివారం డాక్టర్ బ్రహ్మారెడ్డి మీటింగ్ హాల్ నందు వేదిక జిల్లా అధ్యక్షులు రహీం గారి అధ్యక్షతన జరిగినది. ఈ సమావేశంలో డాక్టర్ బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ ప్రధానంగా వచ్చేనెలలో జరగబోయే గ్రామ,వార్డు సభలను జిల్లా వ్యాప్తంగా సరిగా జరిగే విధంగా కృషి చేయాలని అందులో భాగంగా 13/09/21 వ తేదీన అన్ని మండలాల అభివృద్ధి అధికారులకు గ్రామ సభలను తప్పకుండా నిర్వహించమని దానికి సంబంధించిన షెడ్యూల్ ను వెంటనే విడుదల చేయమని కోరుతూ వినతి పత్రాలను సమర్పించాలని అలాగే జిల్లా హెడ్ క్వార్టర్స్ నందు జిల్లా పంచాయతీ అధికారులకు నగరములలో మున్సిపల్ కమిషనర్ లకు వార్డు సభలు జరపాలని వినతిపత్రాలు సమర్పించాలని తీర్మానం చేశారు. జిల్లా యందు వేదిక విస్తరణకు, ప్రజాస్వామ్య



పరిరక్షణకు పలు కార్యక్రమములు చేపట్టుటకు నిర్ణయించారు. సమావేశమునకు ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక రాష్ట్ర బాధ్యులు రామ కృష్ణారెడ్డి, శ్రీధర్ న్యాయవాది, పలు మండలాలనుంచి బాధ్యులు పాల్గొన్నారు.

---


# లండన్ వీధుల్లో టైగర్ హై ఓల్టేజ్ యాక్షన్



బాలీవుడ్ యాక్షన్ హీరో అనగానే వెంటనే వినిపించే పేర్లలో టైగర్ ష్రాఫ్ పేరు ముందు వరుసలో ఉంటుంది అనడంలో సందేహం లేదు. వరుసగా యాక్షన్ ప్రధాన చిత్రాలను చేస్తూ ఇండియన్ యాక్షన్ హీరో అంటూ పేరు దక్కించుకున్నాడు. ప్రస్తుతం ఈయన హీరోపంతి 2 సినిమాను చేస్తున్న విషయం తెల్సిందే. బాలీవుడ్ ప్రేక్షకులు ఈ సినిమాపై అంచనాలు ఆకాశమే హద్దు అన్నట్లుగా పెంచేసుకున్నారు. అంతటి అంచనాలున్న ఈ సినిమా కోసం భారీ యాక్షన్ సన్నివేశాలను డిజైన్ చేస్తున్నారు. టైగర్ ష్రాఫ్ సినిమా అంటే అంతా కూడా యాక్షన్ సన్నివేశాలను ప్రధానంగా ఆశిస్తారు. కనుక ఈ సినిమా లో ప్రేక్షకులు కోరుకున్న రేంజ్ లో యాక్షన్ సన్నివేశాలు ఉంటాయని అంటున్నారు.ప్రస్తుతం లండన్ వీధుల్లో భారీ యాక్షన్ సన్నివేశాలు తెరకెక్కించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. హాలీవుడ్ యాక్షన్ కొరియోగ్రాఫర్స్ తో పాటు అంతర్జాతీయ స్థాయి లో గుర్తింపు దక్కించుకున్న ఫైటర్లను ఈ సినిమా కోసం వినియోగించబోతున్నారు అనేది టాక్. ప్రస్తుతం సినిమా కు సంబంధించిన కీలక యాక్షన్ సన్నివేశాల చిత్రీకరణ జరుపుతున్నారు. అది కనుక పూర్తి అయితే సినిమా మెజార్టీ పార్ట్ పూర్తి అయినట్లుగా అవుతుందని మేకర్స్ అంటున్నారు. టైగర్ ను ఈ సినిమాలో ఎలా చూడబోతున్నారు అనే విషయాన్ని అతి త్వరలోనే చూపించేందుకు కూడా మెకర్స్ రెడీ అవుతున్నారట. యాక్షన్ సన్నివేశాల చిత్రీకరణ కోసం నిర్మాతలు భారీ ఎత్తున ఖర్చు చేయబోతున్నారట. ఈమధ్య కాలంలో ఏ బాలీవుడ్ సినిమాలో కూడా యాక్షన్ సన్నివేశాలకు ఇంతగా ఖర్చు చేసి ఉండరు అన్నట్లుగా ఈ సినిమాలో యాక్షన్ సన్నివేశాలు ఉంటాయని అంటున్నారు. తార సుతారి హీరోయిన్ గా నటిస్తున్న ఈ సినిమా లో రొమాన్స్ తో పాటు ఎంటర్ టైనర్ యాక్షన్ అన్ని ఉంటాయని మేకర్స్ ప్రధానంగా చెబుతున్నారు. టైగర్ కు మంచి పేరు తీసుకు వచ్చిన హీరోపంతికి ఇది సీక్వెల్ అవ్వడం వల్ల ఇండస్ట్రీలో ఈ సినిమా పై ఆసక్తి ఉంది. దానికి తోడు మేకర్స్ సినిమాను ఓ రేంజ్ లో రూపొందిస్తున్న కారణంగా అంచనాలు ఆకాశాన్ని తాకేలా ఉన్నాయి.

# 300 మంది కార్మికులతో పురాతన దేవాయంలో 'రాధేశ్యామ్'

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ కథానాయకుడిగా రాధాకృష్ణ కుమార్ దర్శకత్వంలో 'రాధేశ్యామ్' తెరకెక్కుతోన్న సంగతి తెలిసిందే. యూవీ క్రియేషన్స్- టీ సిరీస్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని భారీ బడ్జెట్ తో నిర్మిస్తున్నాయి. అత్యంత భారీ కాన్వాస్ పై ఈ ప్రేమకథా చిత్రం తెరకెక్కుతోంది. 1975 బ్యాక్ డ్రాప్ లో యూరప్ నేపథ్యంలో సాగ్ పీరియాడిక్ చిత్రమిది. ఇందులో అందమైన లవ్ స్టోరీని దర్శకుడు హైలైట్ చేస్తున్నారు. ఓ వైపు భారీ యాక్షన్ సీక్వెన్స్ ని పతాక స్థాయిలో చూపిస్తూనే




1975 కాలానికి తీసుకెళ్లే అద్భుతమైన సెట్స్ ని కూడా అంతే హైలైట్ చేస్తున్నారు. దేశ..విదేశాల్లో అందమైన ఎగ్జాటిక్ లోకేషన్స్ నడుమ చిత్రీకరణ జరిపారు. యూరప్ అందాలు మైమరిపింపజేస్తాయన్న టాక్ ఉంది. తాజాగా సినిమాకు సంబంధించిన ఇంట్రెస్టింగ్ న్యూస్ ఒకటి లీకైంది. చిత్రీకరణలో భాగంగా ఆంధ్రప్రదేశ్ లో ఓ పురాతనమైన దేవాలయలో ఏకంగా పది రోజుల పాటు నిర్విరామంగా షూటింగ్ చేసారుట. ఇందులో 100 పురోహితులు కూడా భాగమైనట్లు సమాచారం. ఈ షూట్ కోసం దాదాపు 300 మంది కార్మికులు పనిచేసారుట. దేవాలయం షూట్ కోసం ఇప్పటివరకూ ఇంత మంది క్రూ ఏ సినిమాకు పనిచేయలేదు. అలాగే ఇన్ని రోజుల పాటు చిత్రీకరణ కూడా జరగలేదు. ఆ రకంగా ఆ సన్నివేశాలకు ఎంత ప్రాధాన్యత ఉంటుందో అర్ధమవుతోంది. ఇందులో ప్రభాస్..పూజా హెగ్డే సహా కీలక నటులంతా ఈ షూట్ లో పాల్గొన్నారు. పురాతన దేవాలయంలో షూట్ కి అవసరమైన సెటప్ అంతా హైదరాబాద్ ని తరలించారు. అంటే ఇక్కడ యజ్ఞ యాగాలు..క్రతువులకు సంబంధించిన సన్నివేశాలు భారీ స్థాయిలో 100 మంది పురోహితుల సమక్షంలో షూట్ చేసినట్లు తెలుస్తోంది. ఈ సన్నివేశాలు కూడా సినిమాలో అంతే హైలైట్ కానున్నాయి. అయితే ఏపీలోని ఆ దేవాలయం పేరును గానీ..ప్రాంతాన్ని గానీ యూనిట్ ఎక్కడా లీక్ చేయలేదు. నేరుగా సినిమాలో చూసి థ్రిల్ ని అందించేలా ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే రాధేశ్యామ్ షూటింగ్ పూర్తయింది. డార్లింగ్ ప్రభాస్ బ్యాక్ టు బ్యాక్ సినిమాలతో క్షణం తీరిక లేనంత బిజీగా ఉన్నాడు. ఇప్పటికే వరుసగా మూడు సినిమాల్ని ప్రారంభించాడు. రాధేశ్యామ్ సంక్రాంతి బరిలో రిలీజవుతుండగా.. సలార్ -ఆదిపురుష్ 3డి చిత్రాలను శరవేగంగా పూర్తి చేస్తున్నాడు. పనిలో పనిగా నాగ్ అశ్విన్ తో సైన్స్ ఫిక్షన్ మూవీని ప్రారంభించి షెడ్యూళ్లకు సహకరిస్తున్నాడు. ఇంతలోనే ప్రభాస్ నటించే 25వ సినిమా గురించి ఆసక్తికర విషయం రివీలైంది. ఈ సినిమాని శ్రీవెంకటేశ్వర క్రియేషన్స్ అధినేత దిల్ రాజు నిర్మిస్తారు. ప్రభాస్ తో డార్లింగ్ లాంటి బ్లాక్ బస్టర్ తీశాక దిల్ రాజు మరో సినిమా చేయాలని ఎంతో కాలంగా వేచి చూస్తున్నాడు. అందుకే ఈసారి యువి క్రియేషన్స్ ని పక్కనపెట్టి దిల్ రాజు కు 25వ సినిమా ఆఫర్ ఇచ్చాడట. ఇప్పటికే టైటిల్ ఫైనలైందని కథనాలస్తున్నాయి. 'బృందావన' అనే టైటిల్ ని ఫిలింఛాంబర్ లో రిజిస్టర్ చేయించిన దిల్ రాజు పాన్ ఇండియా కేటగిరీలో కథాంశాన్ని సిద్ధం చేయించాడని ప్రచారమవుతోంది. ప్రభాస్ తో దిల్ రాజు 2023 చివరలో ఈ సినిమాను ప్రారంభిస్తారట. దర్శకుడు కథానాయిక ఎవరు? అన్నది తెలియాల్సి ఉంది. బృందావన ... చారిత్రక నేపథ్యం ఉన్న ఉత్తర ప్రదేశ్ మథుర జిల్లాలోని ఒక పట్టణం పేరు. శ్రీ కృష్ణ భగవానుడు తన బాల్యాన్ని ఇక్కడే గడిపాడు. కృష్ణ భగవానుని జన్మ స్థలమైన మథుర నుండి 15 కి.మీ. దూరంలో బృందావన ఉంది.

# నితిన్ కొత్త చిత్రం ప్రారంభం.. హీరోయిన్ ఎవరంటే..?

టాలీవుడ్ యూత్ స్టార్ నితిన్ బ్యాక్ టు బ్యాక్ సినిమాతో ప్రేక్షకులను అలరిస్తున్నారు. ఇప్పటికే ఈ ఏడాది ప్రథమార్థంలో రెండు చిత్రాలను విడుదల చేసిన నితిన్.. 'మాస్ట్రో' చిత్రాన్ని రిలీజ్ కు రెడీ చేశారు. మేర్లపాక గాంధీ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ క్రైమ్ కామెడీ ఎంటర్టైనర్ చిత్రాన్ని సెప్టెంబర్ 17న డిస్నీ ప్లస్ హాట్ స్టార్ ఓటీటీలో




రిలీజ్ చేస్తున్నారు. ఈ క్రమంలో నేడు వినాయక చవితి సంధర్భంగా నితిన్ తన 31వ చిత్రాన్ని ప్రకటించారు. చౌతిబిష్త్రతిని31 సినిమాతో ప్రముఖ ఎడిటర్ ఎస్ఆర్ శేఖర్ ఇండస్ట్రీకి డైరెక్టర్ గా పరిచయం అవుతున్నాడు. 'లై' 'చల్ మోహన్ రంగ' 'హార్ట్ ఎటాక్' 'మాస్ట్రో' వంటి సినిమాలకు ఎడిటింగ్ బాధ్యతలు నిర్వహించిన ఎస్ఆర్ శేఖర్.. ఇటీవల చెప్పిన కథ నచ్చడంతో నితిన్ వెంటనే గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని తెలుస్తోంది. శ్రేష్ఠ మూవీస్ బ్యానర్ పై ఎన్.సుధాకర్ రెడ్డి - నికిత రెడ్డి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇది నితిన్ హోమ్ ప్రొడక్షన్ లో వస్తున్న 7వ సినిమా. ఇందులో యూత్ స్టార్ సరసన యంగ్ సెన్సేషనల్ కృతి శెట్టి హీరోయిన్ గా నటిస్తోంది. ఈరోజు శుక్రవారం పూజా కార్యక్రమాలతో ఈ సినిమాని లాంఛనంగా ప్రారంభించారు. చౌతిబిష్త్రతిని31 ముహూర్తపు సన్నివేశానికి బ్లాక్ బస్టర్ డైరెక్టర్ అనిల్ రావిపూడి గౌరవ దర్శకత్వం వహించారు. నితిన్ - కృతి శెట్టి లపై ఫస్ట్ షాట్ కు అగ్ర నిర్మాత అల్లు అర్జున్ క్లాప్ ఇవ్వగా.. రామ్ మోహన్ కెమెరా స్విచ్చాన్ చేశారు. 'భీష్మ' డైరెక్టర్ దర్శకుడికి స్క్రిప్ట్ ను అందించారు. ప్రసాద్ మూరెళ్ల ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ అందించనున్నారు. నితిన్ నటించిన 'భీష్మ' 'మాస్ట్రో' చిత్రాలకు సంగీతం సమకూర్చిన మహతి స్వర సాగర్ ఈ సినిమాకి ట్యూన్స్ కంపోజ్ చేస్తున్నారు. వినాయక చవితి పండుగను పురస్కరించుకుని ఈరోజు సాయంత్రం 5.30 గంటలకు చౌతిబిష్త్రతిని31 మాసీ టైటిల్ మరియు మోషన్ పోస్టర్ ను రిలీజ్ చేయనున్నట్లు మేకర్స్ వెల్లడించారు. ఈ చిత్రానికి సంబంధించిన పూర్తి వివరాలు టైటిల్ తో పాటుగా ప్రకటించే అవకాశం ఉంది.

# కోహ్లి ప్రతిపాదనను తిరస్కరించిన ఈసీబీ.. 22న యూకేకు గంగూలీ!




టీమిండియా- ఇంగ్లండ్ మధ్య శుక్రవారం జరగాల్సిన ఐదో టెస్టు నిరవధికంగా వాయిదా పడటంతో క్రికెట్ అభిమానులు తీవ్ర నిరాశకు లోనయ్యారు. ఇప్పటికే 2-1 తేడాతో సిరీస్‌లో ఆధిక్యంలో కొనసాగుతున్న కోహ్లి సేన.. ఇంగ్లండ్‌ను ఓడించి ట్రోఫీ గెలుస్తుందా లేదా సమం చేస్తుందా అనే చర్చ జోరుగా నడిచింది. అయితే, కోవిడ్ కారణంగా ఆరంభానికి ముందు ఆఖరి టెస్టు రద్దు కావడంతో అందరూ ఉసూరుమన్నారు. బయో బబుల్ నిబంధనలు ఉల్లంఘించడం వల్లే ఈ దుస్థితి దాపురించిందంటూ సోషల్ మీడియా వేదికగా ఆగ్రహం వ్యక్తం చేశారు. కాగా ఇటీవల బుక్‌లాంచ్ చేసిన టీమిండియా హెడ్ కోచ్ రవిశాస్త్రికి కరోనా సోకడంతో.. ఆయన బాధ్యతారాహిత్యం వల్లే ఇలా జరిగిందంటూ విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఇంగ్లండ్ క్రికెట్ బోర్డు ఐదో టెస్టును నిరవధికంగా వాయిదా వేసిన క్రమంలో భారత జట్టు కెప్టెన్ విరాట్ కోహ్లికి సంబంధించిన ఆసక్తికర వార్త వెలుగులోకి వచ్చింది. వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్ నేపథ్యంలో ఐదు మ్యాచ్‌ల టెస్టు సిరీస్ ఇరు జట్లకు కీలకంగా మారిన విషయం తెలిసిందే. అయితే, చివరి టెస్టుకు ముందు టీమిండియా సెకండ్ ఫిజియో యోగేశ్ పర్మార్‌కు పాజిటివ్‌గా తేలడంతో మ్యాచ్ నిర్వహణపై నీలినీడలు కమ్ముకున్నాయి. ఆటగాళ్లందరికీ పరీక్షలు నెగటివ్ వచ్చినప్పటికీ.. ముందు జాగ్రత్త చర్యగా మ్యాచ్ వాయిదా వేస్తున్నట్లు ప్రకటించిన ఈసీబీ ఆ తర్వాత నిరవధికంగా వాయిదా వేసినట్లు వెల్లడించింది. కాగా రెండు రోజుల తర్వాత మ్యాచ్‌ను నిర్వహించాల్సిందిగా కోహ్లి ప్రతిపాదించినట్లు సమాచారం. హెడ్ కోచ్‌తో పాటు కీలక అడ్వైజర్లు అందుబాటులో లేకపోవడం, ఫిజియోథెరపిస్టు కూడా కరోనా బారిన పడటంతో రెండు లేదా మూడు రోజుల అనంతరం మ్యాచ్ ఆడించాలని కోరినట్లు తెలుస్తోంది. అయితే, ఈసీబీ మాత్రం ఈ ప్రపోజల్‌ను తిరస్కరించి మ్యాచ్‌ను నిరవధికంగా వాయిదా వేసేందుకే మొగ్గు చూపడం గమనార్హం. ఈనెల 22న యూకేకుఇక మ్యాచ్ రీషెడ్యూల్ గురించి చర్చించే క్రమంలో బీసీసీఐ అధ్యక్షుడు సౌరవ్ గంగూలీ, ఈనెల 22న ఇంగ్లండ్ వెళ్లే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. మ్యాచ్ అర్ధంతరంగా ఆగిపోవడం, తద్వారా ఈసీబీకి జరిగిన నష్టం, తిరిగి ఎప్పుడు మ్యాచ్ నిర్వహించాలన్న అంశాలపై చర్చించనున్నట్లు తెలుస్తోంది.

## కోచ్, సహాయక సిబ్బంది లేకుండానే నాలుగో టెస్టు ఆడింది

పాకిస్తాన్ మాజీ కెప్టెన్ ఇంజామముల్ హక్ టీమిండియాకు మద్దతుగా నిలిచాడు. మాంచెస్టర్‌లో ఇంగ్లండ్‌తో జరగాల్సిన ఐదో టెస్టు నిరవధికంగా వాయిదా పడటం పట్ల భారత జట్టును తప్పుపట్టాల్సిన అవసరం లేదని పేర్కొన్నాడు. కాగా టీమిండియా అసిస్టెంట్ ఫిజియో యోగేశ్ పర్మార్‌కు కరోనా సోకిన నేపథ్యంలో ఓవల్ ట్రఫోర్డ్ మైదానంలో శుక్రవారం జరగాల్సిన నిర్ణయాత్మక మ్యాచ్ తాత్కాలికంగా రద్దైన విషయం తెలిసిందే. ఆటగాళ్లందరికీ కోవిడ్ పరీక్షల్లో నెగటివ్ వచ్చినప్పటికీ మ్యాచ్‌ను వాయిదా వేశారు. ఈ నేపథ్యంలో ఐపీఎల్‌ను దృష్టిలో పెట్టుకునే ఈ నిర్ణయం తీసుకున్నారంటూ విమర్శలు వెల్లువెత్తాయి. ఈ విషయంపై తన యూట్యూబ్ చానెల్ వేదికగా స్పందించిన ఇంజమాముల్ హక్.. టీమిండియా నిర్ణయం సరైనదేనని సమర్థించాడు.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**